ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0

అరగంట ముందే గేట్ క్లోజ్

» నేడు నీట్-పీజీ పరీక్ష

» ఏలూరులో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా ప్రోగ్రాంలలో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న నీట్-పీజీ పరీక్షకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పరీక్ష నిమిత్తం ఏలూరు శివారు వట్లూరులోని సీఆర్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు 200మంది అభ్యర్థులను, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలుకు 174 మందిని కేటాయించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు ఉదయం 7గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే అంటే ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రం ప్రధాన ప్రవేశ ద్వారాన్ని మూసివేస్తారు. అడ్మిట్‌కార్డు ఏ4 సైజు కలర్ ప్రింటవుట్, ప్రభుత్వ ఐడీ కార్డు ఒరిజినల్, ఎస్ఎంసీ/ఎంసీఐ/ఎన్ఎంసీ రిజిస్ట్రేష న్ ఫొటోస్టాట్ కాపీ, పెన్‌తో మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారు.

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ధర్నా

ఏలూరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యా సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించింది. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జి.మోహనరావు, సెక్రటరీ జనరల్ ఎం.ఆదినారాయణ, కోచైర్మన్ జి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు పిల్లలు చదువు నేర్చుకోవడానికి బడికి వస్తే టీచర్లు చదువు నేర్పేవారని, ఇప్పుడు పిల్లలు బడికి వచ్చేది మధ్యాహ్న భోజనం, దుస్తులు, కోడి గుడ్లు, చిక్కి, రాగిజావ కోసం, టీచర్లు వీటిని పిల్లలకు అందించి ప్రభుత్వానికి లెక్కలు చెప్పటానికి మాత్రమే అన్నట్టు పరిస్థితి తయారైందని విమర్శించారు. బదిలీలు జరిగిన 45 రోజులు దాటినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమానికి మద్దతుగా ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడారు. ఫ్యాప్టో కో చైర్మన్ ప్రకాశరావు, నాయకులు రెడ్డి దొర, శామ్యూల్, శివరాం, రమేష్, జిలాని, వందలాది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

మూడో కన్ను ■ లోపలి పేజీలో..

» నేరస్థులకు సింహస్వప్నంగా డ్రోన్ టెక్నాలజీ



పునరుత్తేజం

గనుల ఆదాయం పెంపునకు కసరత్తు

రాష్ట్రంలో మైనింగ్ రంగానికి పునరుత్తేజం తీసుకొచ్చేలా ప్రభుత్వం మైనర్ మినరల్ పాలసీ అమలుకు శ్రీకారం చుట్టింది. దీనికి అనుగుణంగా జిల్లాలో గనులు లీజులను ఆన్‌లైన్ పద్ధతిలో జారీకి ఏర్పాట్లు జరుగు తున్నాయి. తద్వారా గనుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పక్కాగా జమ అయ్యేలా ప్రభుత్వం నడుంబిగించింది. జూలై 1వ తేదీ నుంచి ఆన్‌లైన్ దర ఖాస్తులను స్వీకరించారు. వీటికి త్వరలో సింగిల్‌విండో కింద అధికారులు అను మతులు జారీ చేస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో 16 దరఖాస్తులు అందాయి.

» పారదర్శకంగా మైనింగ్ మినరల్ పాలసీ
» సింగిల్ విండో కింద త్వరలో అనుమతులు
» ఆన్‌లైన్‌లో లీజులకు 16 దరఖాస్తులు
» 28 పెండింగ్ దరఖాస్తులకు మోక్షం కల్పించేందుకు చర్యలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రధానంగా గ్రావెల్, రోడ్డుమెటల్, లైమ్‌స్టోన్, బాల్‌క్లే తదితరాలకు దరఖాస్తులను స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్దేశ పూర్వకంగానే కొందరి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచేసింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి పెండింగ్ ఉన్న వాటిని పరిష్కరించేందుకు నడుం బిగించింది. దీంతో ఎక్కువ మందికి లీజులు పొందే అవకాశాలకు మార్గం సుగమం చేసింది. 2022 మార్చి 13 నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ పరిగణనలోకి తీసుకుని లీజులు కేటాయిస్తారు. ఇప్పటికీ ఆ లీజు ప్రాంతం ఖాళీగా ఉండి ఎవరికి మంజూరు చేయకుండా ఉంటే.. వాటిని పాత దరఖాస్తుదారులకు కేటాయిస్తారు. అప్పటికి దరఖాస్తు ఫీజు, డిపాజిట్ చెల్లించిన వారికే ఈ అవకాశం ఇస్తారు. వార్షిక డెడ్ రెంట్ విలువకు మూడు రెట్లు మొత్తంలో మూడు నెలల్లో ఒక విడత సొమ్ము చెల్లించాలి. తర్వాత ఎన్‌వోసీ తెచ్చుకుంటే లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)లు ఇచ్చి అన్నీ అనుమతులు పొందేందుకు ఏడాది గడువు ఇస్తారు. మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతులు, సీఎఫ్ఈ అండ జేసి ఉంటే.. వాటిని లీజుల మంజూరుకు పరిగణనలోకి తీసుకుంటారు. గనులశాఖ అధికారులు అనుమతి లేకుండా లీజులను బదిలీ చేయకూడదు. లీజు బదిలీ కోసం దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించాలి.

సీనరేజ్ కాంట్రాక్ట్‌కు త్వరలో చర్యలు

జిల్లా పరిధిలో గనుల తవ్వకాలకు సంబంధించి భూగర్భ గనులశాఖ ఆధ్వర్యంలోనే ఇక అనుమతులు ఇవ్వనున్నారు. వైసీపీ హయాంలో వీటికి సంబంధించి సీనరేజ్ వసూళ్ల బాధ్యత సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చి రెండేళ్లకు సీనరేజ్ వసూళ్లను చేయించారు.ఆ గడువు కాస్త ముగిసింది. దీంతో త్వరలోనే టెండర్లు లేదా బహిరంగ వేలం విధానంలో సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టును అప్పగించనున్నారు. లీజులు, సీనరేజ్ కాంట్రాక్టు కేటాయింపులపై జిల్లా గనులశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ కిశోర్ బాపూజీ మాట్లాడుతూ మైనింగ్ పాలసీ ద్వారా జిల్లాలో ఆదాయం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి పర్యావరణ, అన్ని అనుమతులు పరిశీలించి లీజులను కేటాయిస్తామన్నారు. సీనరేజ్ కాంట్రాక్టు కేటాయింపు విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

ఐదు రెట్ల ప్రీమియంతో లీజుల పునరుద్ధరణ

వార్షిక్ డెడ్‌రెంట్ విలువకు ఐదు రెట్ల మేర ప్రీమియం మొత్తంగా చెల్లిస్తే లీజులను పునరుద్ధరిస్తారు. అది కూడా రెండు, మూడు వాయిదాల్లో చెల్లించవచ్చు. లైమ్‌స్టోన్ స్లాబ్‌లకు జిల్లాల వారీగా సీనరేజ్ వసూళ్లకు, కాంట్రాక్టర్లు ఎంపికకు ఐదేళ్ల గనుల శాఖ రాబడిని పరిశీలించి బేస్ దర నిర్ణయిస్తారు. రెండేళ్ల కాలానికి కాంట్రాక్టర్‌కు వసూళ్లకు అవకాశం ఇచ్చారు. రిజర్వ్ ధరలో 2.5 శాతం మేర కాంట్రాక్టరు బ్యాంకు గ్యారంటీగా జమ చేయాలి.

మర్యాద పూర్వకంగా మెలగాలి

» డీపీటీవో షబ్నం

ఏలూరు,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 15 నుంచి అమలు చేయనున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాలకు సంబంధించి కండక్టర్లు, డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి ఆర్టీసీకి మంచి పేరు తీసుకురావాలని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) షేక్ షబ్నం సూచించారు. ఏలూరు కొత్త బస్టాండ్‌లో కండక్టర్లు, డ్రైవర్లకు శనివారం శిక్షణ ఇచ్చారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగడంతో పాటు మహిళలకు జీరో టిక్కెట్‌ను టిమ్ మిషన్‌లో ఎలా ఇవ్వాలి, తదితర అంశాలపై అవగాహన పరిచారు.



ఆర్టీసీ సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న డీపీటీవో షేక్ షబ్నం



• లారీ స్టాండ్ కాదండోయ్..

ఇక్కడ నిలిపి ఉంచిన వాహనాలను చూస్తుంటే ఇదేదో లారీ స్టాండ్ అని భావిస్తే పొరబడినట్టే. ఎందుకంటే ఇది పెదపాడు పోలీస్‌స్టేషన్ ఆవరణ. ఈ వాహనాలన్నీ పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేసిన వాహనాలే. రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసుల్లో వచ్చిన వాహనాల కంటే చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను తరలిస్తూ పట్టుబడిన వాహనాలే అధికం. హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ పెద్దసంఖ్యలో చికెన్ వ్యర్థాలను ఇక్కడకు తరలిస్తుంటారు. పోలీసులు తనిఖీల్లో ఐషర్, బోలేరో వాహనాలను పట్టుకుని వాటిని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంచడంతో ఇలా వాహనాలతో నిండి పోయింది. పట్టుబడిన ప్రతిసారి వాహన క్లియరెన్స్‌లు రాగానే మరలా చికెన్ వ్యర్థాల రవాణాకు వెళుతుండడంతో ఇక్కడున్న ప్రతి వాహనంపై ఐదు అంతకంటే ఎక్కువ సార్లు చికెన్ వ్యర్థాలు రవాణా చేస్తున్న కేసులు న్నాయి.

\- పెదపాడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



• బీఎండీ ఛానల్‌కు కొత్త షట్టర్ బిగింపు

బంటుమిల్లి మెయిన్ డిస్ట్రిబ్యూటరీ ఛానల్‌కు కమలాపురం లాకుల వద్ద కొత్త షట్టరును శుక్రవారం ఏర్పాటు చేశారు. షట్టరు శిథిలమై నీటిని సరిపడినంత విడుదల చేసే అవకాశం లేకపోవడంతో దానిని తొలగించి నూతన షట్టరును ఏర్పాటు చేశారు. 'బీఎండీ ఛానల్ షట్టర్లు శిథిలం' శీర్షికన గత నెల 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు నూతన షట్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.కమలాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమోతు చంద్రకళాధరరావు, బంటుమిల్లి సెక్షన్ ఏఈ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కొత్త షట్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు 60 నుంచి 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, షట్టర్ ఏర్పాటు అనంతరం సుమారు 90 క్యూసెక్కులకు పైగా నీటిని బీఎండీ ఛానల్‌ను విడుదల చేసే అవకాశం ఏర్పడిందని లాక్ సూపరింటెండెంట్ నాగరాజు తెలిపారు.

\- ముదినేపల్లి

పోలవరంలో లీకేజీ సెగ



దేవినేని ఉమా, కరాటం రాంబాబు సంభాషణ లీక్

కూటమిలో కలవరం.. దుమారం

ఎమ్మెల్యేపై తరచూ అవినీతి ప్రచారం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం ఎస్టీ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వీలు చిక్కినప్పుడల్లా ఆయన అవినీతికి పాల్పడుతున్నారంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. ఈ మధ్యనే మరో దుమారంలో చిక్కుకున్నారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా, ఉమ్మడి పశ్చిమ గోదావరి రాజకీయ దిగ్గజం, జనసేన నేత కరాటం రాంబాబు మధ్య సాగిన ఫోన్ సంభాషణ కాస్త లీకైంది. ఎమ్మెల్యే బాలరాజు అవినీతిపై జరిగిన ఈ సంభాషణ యావత్తు కావాలనే లీక్ చేశారా, చేస్తే ఎవరు చేశారు, ఏమి ఆశించి చేశారు, అంతర్గతంగా ఎమ్మెల్యేను ఇరకాటంలో పెట్టేందుకే సీనియర్ల ప్రమేయం లేకుండా ఏకపక్షంగా లీకేజి ఎలా చేయగలిగారు అనే ప్రశ్నలే తలెత్తుతున్నాయి. భారీఎత్తున వెనకేసుకున్నట్లు ఈ సంభాషణల సారాంశం కాగా, ఇంకోవైపు జనసేన ఎమ్మెల్యేలే ఏడాదిలోపే ఈ స్థాయికి దిగజారిపోయారంటూ సాగిన ఫోన్ లీకేజీలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపాయి.

జూదంపై ప్రచారం

ఎమ్మెల్యే ఆశీస్సులతో నియోజకవర్గంలో ఇటీవల పెద్ద ఎత్తున జూదం సాగుతోందని, రోజుకు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయంటూ యూట్యూబ్‌ల్లో ప్రచారం సాగింది. ఈ దందాను ఆపాల్సింది పోయి ఎమ్మెల్యే రోజువారీ మామూళ్లను వెనకేసుకుంటున్నారంటూ ఓ యూ ట్యూబర్ ప్రచారం చేశాడు. దీంతో ఎమ్మెల్యే బాలరాజు జిల్లా ఎస్పీ కిశోర్‌ను కలిసి రాజకీయంగా తనను ఇబ్బంది పాలు చేసేందుకే ఆ యూట్యూబ్ పత్రిక ఏ రకంగా విష ప్రచారం చేసిందో ఆధారాలతో సహా ఆయన ముందుంచారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేలుగా తాము ప్రజలకు సేవ చేయాలా, లేకుంటే ప్రతీవారు వేసే బురదను కడుక్కుంటూ కూర్చోవాలా అంటూ బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై విష ప్రచారం చేస్తున్న ఆ యూట్యూబర్‌పై ఫిర్యాదు చేయడం, దీనికి అనుగుణంగా ఆ వ్యక్తిని అరెస్టు చేయడం చకచకా జరిగిపోయాయి. ఎవరుబడితే వారు తనపై దుష్ప్రచారానికి దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానంటూ ఎమ్మెల్యే హెచ్చరించారు.

నిరూపించండి.. చర్చకు సిద్ధం

\- ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి శత విధాలా ప్రయత్నిస్తున్నా. కావాలనే కొందరు బురద చల్లుతున్నారు. ఇద్దరు పెద్ద నాయకుల మధ్య వచ్చిన చర్చను ఊరూ, వాడా ప్రచారం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇదంతా గిట్టని వాళ్ల కుట్ర. ఓర్వలేని కొందరు నేతలు ఈ తరహా చీప్ ట్రిక్స్‌కు పాల్పడుతున్నారు. జనసేనను టార్గెట్ చేసి కొందరు యాగీ చేస్తున్నారు. నేను కోట్లు సంపాదించినట్టు చెబుతున్నారు కదా.. ఎక్కడ్నుంచి వచ్చాయో, ఎవరెవరి నుంచి వచ్చాయో, ఏ ప్రాంతం నుంచి వచ్చాయో ఎవరైనా నిగ్గు తేల్చవచ్చు. బహిరంగ చర్చకు నేను సిద్ధమేనని సవాల్ చేస్తున్నా. పనిగట్టుకుని యాగీ చేస్తారా ? నాకు ముందు నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా చేసిన వారున్నారు. వారెంత సంపాదించాలి ? పార్టీ పెద్దల దృష్టికి అన్ని విషయాలు తీసుకెళ్లా.

ఎందుకిలా జరుగుతోంది ?

పోలవరం నియోజకవర్గంలో గతంలో పని చేసిన ఎమ్మెల్యేలపైన కొన్ని ఆరోపణలున్నాయి. కానీ వీటిని ఊరూ, వాడా ప్రచారం చేయలేదు. ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారంలో మాత్రం కూటమిలోనే కొందరు కావాలనే అగ్గి రాజేస్తున్నట్టు భావిస్తున్నారు. ఆ నేతలు జనసేన పక్షమా? లేకుంటే కూటమి భాగస్వామ్య పక్షాల్లో మరెవరిదైనా హస్తం ఉందా అనే ప్రశ్న తలెత్తినప్పుడు వివాదం ముదురుతూ వస్తోంది. ఈ మధ్య కాలంలో పోలవరం మార్కెట్ కమిటీ విషయంలోనూ జరిగిన ప్రచారాన్ని జనసేన నేతలు గుర్తుచేస్తున్నారు. ప్రత్యేకించి టీడీపీకి చెందిన కొందరు అంతా తమదేనన్నే విధంగా వ్యవహరించిన తీరును తప్పు పడుతున్నారు. గతంలో తనపై ఆరోపణలు వచ్చినప్పుడు జరిగిన వాస్తవాలను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, సీనియర్ నేత మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసారి వచ్చిన ఆరోపణలు, జరిగిన ప్రచారాన్ని సైతం అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు.

రైతుల ఆర్థిక పురోభివృద్ధికి దోహదం

» కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కామవరపుకోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):రైతుల ఆర్థిక పురోభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకంలో లక్షా 60 వేల 968 మంది రైతులకు రూ.107.08 కోట్లు అందించామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎనిమిది మంది రైతులకు డ్రోన్లు అందించామని, అర్హత, ఆసక్తి కలిగిన వారు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే అందిస్తామన్నారు. ప్రకృతి వ్యవ సాయాన్ని, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అధికంగా చింతలపూడి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 36,818 మంది రైతులకు రూ.24.55 కోట్లు అందించామన్నారు. అర్హత ఉండి మంజూరుకాని రైతులు 155251 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. సభ ఆవరణలో ఏర్పాటు చేసిన సంప్రదాయ వ్యవసాయ స్టాల్స్‌ను కలెక్టర్, ఎమ్మెల్యేలు పరిశీలించి అభినందించారు. జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి ఆర్డీవో దేవకీదేవి, జిల్లా వ్యవ సాయాధికారి హబీబ్‌బాషా, మండల వ్యవసాయ శాఖ అధికారు లు ముత్యాలరావు, ప్రదీప్‌కుమార్, తహసీల్దార్ గెద్దం ఎలీషా, ఎంపీడీవో సరళకుమారి, ఎంఈవో సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, జగ్గవరపు ముత్తారెడ్డి, రైతు నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు. వారణాసిలో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం కిసాన్ కార్యక్రమాన్ని, ప్రకాశం జిల్లా దర్శి మండలంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్న అన్నదాత సుఖీభవ ప్రారంభ లైవ్ కార్యక్రమాలను కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికార, ఉద్యోగులు తిలకించారు.



అన్నదాత సుఖీభవ పథకం నిధుల చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే రోషన్‌కుమార్




అ భద్రతలో.. అమ్మతనం!

ఏఆర్టీ/సరోగసీ క్లినిక్ సేవల్లో పారదర్శకత ఎంత..?

సంతాన సాఫల్యత కోసం ఆశ్రయిస్తున్న యువజంటలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):దాంపత్య జీవితంలో సంతానం కీలకం. పూర్వకాలంలో ఎక్కువమంది పిల్లలకు జన్మనివ్వడం ఉమ్మడి కుటుంబాల్లో సాధారణం కాగా, ఇప్పటి న్యూక్లియర్ కుటుంబాల్లో యువజంటలు ఆధునిక పోకళ్లతో ఏళ్ల తరబడి వాయిదా వేయడం పరిపాటైంది. 21వ శతాబ్దపు దాంపత్యంలో జననాల సంఖ్య గణనీయంగా పడిపోతుండగా, మరోవైపు పనిఒత్తిళ్లు, మూడుపదుల వయస్సు దాటినా వివాహాలకు దూరంగా ఉండడం, శారీరక, ఆరోగ్య సంబంధిత సమస్యలు, తదితర అంశాలు పిల్లల పుట్టుకపై పెనుప్రభావాన్నే చూపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్లు, సరోగసీ పద్ధతుల్లో బిడ్డకు జన్మనిచ్చే పద్ధతులు వేగంగా విస్తరిస్తున్నాయి. సంతాన సాఫల్యత కోరుకునే జంటలు విభిన్న కారణాలతో వీటిని ఆశ్రయిస్తున్నాయి. ఇటువంటి దంపతులకు సంతానభాగ్యం కలిగించేందుకే సంతాన సాఫల్య కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నానాటికీ పెరిగిపోతున్న డిమాండ్ కనుగుణంగానే మోసపూరిత మైన విధానాలను పాటించే వాటిబారిన పడి ఆర్థికంగా నష్టపోయినవారూ లేకపోలేదు. ఇటీవలే సరోగసి విధానంలో శిశువు జన్మించిందంటూ ఓ యువజంటకు వేరే రాష్ట్రంలో కొనుగోలు చేసిన నవజాత శిశువును అప్పగించి ఘరానా మోసానికి పాల్పడిన ఓ వైద్యురాలి ఉదంతం తెలిసిందే. ఈ ఉదంతం తెలుగురాష్ట్రాల్లో కలకలానే సృష్టించింది.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు



జిల్లాలో ఏలూరులో టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్(లెవెల్-1), ఫెర్టిలిటీ సెంటర్(లెవెల్-2), నూజివీడులో నర్సింగ్ హోం(లెవెల్-2) వైద్యఆరోగ్య శాఖ వద్ద రిజిస్టరై ఉన్నాయి. ఈ ఏడాది జనవరినుంచి ఇప్పటి వరకు ఆరు కేసులు మాత్రమే వచ్చాయని చెబుతున్నారు. ముఖ్యమైన కేసులన్నీ విజయవాడకు వెళుతున్నాయని మా పరిశీలనలో గమనించాం. ఈ క్లినిక్‌లన్నింటిలో అర్హులైన వైద్యులున్నారు. పేషెంట్ల వైద్యానికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు పంపిస్తున్నారు. క్లినిక్‌లలో పనిచేసే సిబ్బంది వివరాలను బహిరంగంగా కనబడేలా ప్రదర్శించా లని ఆదేశించాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన నిబంధన లన్నింటినీ క్లినిక్‌లు పక్కాగా అమలు చేయకపోతే చర్యలు తప్పవు.

\- డాక్టర్ పీ.జే.అమృతం, డీఎంహెచ్‌వో

నిబంధనలు అత్యంత కఠినతరం

జిల్లాలో ఏలూరులో రెండు, నూజివీడులో ఒకటి ఏఆర్టీ(అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ) సెంటర్లున్నాయి. వీటి ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం పకడ్బందీగా నిబంధనలను 2021లోనే చట్టంలో రూపొందించింది. ఆ ప్రకారం ఏఆర్టీ/సరోగసీ క్లినిక్ ఏర్పాటు చేయాలంటే సంబంధిత హాస్పిటల్‌కు రిజిస్ట్రేషన్, స్కానింగ్ సెంటర్ ఉండాలి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ రిజిస్ట్రీ, ఏఆర్టీ రెగ్యులేషన్ చట్టం-2021కి అనుగుణంగా 81 రకాల నిబంధనలను పాటించాలి. ఏఆర్టీ లెవెల్-1 (మిగతా 8వ పేజీలో)



రాచపట్నంలో ఇరిగేషన్ అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

నీరు సముద్రం పాలవుతున్నా..

శివారు గ్రామాలకు సాగునీరు ఇవ్వరా..?

» ఇరిగేషన్ ఎస్ఈని ప్రశ్నించిన రైతులు

కైకలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నదులు పొంగి నీరు సముద్రం పాలవుతున్నా శివారు గ్రామాలకు సాగునీరు సరఫరా చేయడంలో అధికారులు ఎందుకు విఫలమవుతున్నారని రైతులు మండిపడ్డారు. రాచపట్నంలో శనివారం పంట పొలాలను, పంట కాలువలను ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.మోహనరావు, సాగునీటి సంఘాల సభ్యులు, డీసీ చైర్మన్లు, రైతులతో కలిసి పరిశీలించారు. వేల టీఎంసీల నీరు ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోనికి నీరు వెళ్లిపోతుందని కానీ కాలువలకు సామర్థ్యం మేరకు నీరు సరఫరా చేయకపోవడంతో పంటలకు నీరు చాలక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఈ మాట్లాడుతూ కైకలూరు, కలిదిండి శివారు ప్రాంతాలకు నీరు అందించేందుకు కాలువకు వారాబందీ ప్రకారం నీటిని సరఫరా చేస్తామన్నారు. అనంతరం కైకలూరు ఇరిగేషన్ కార్యాలయంలో సాగునీటి సంఘాల నాయకులు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బి.ఆంజనేయ ప్రసాద్, ఇరిగేషన్, డ్రెయినేజీ డీఈలు శిరీష, రామకృష్ణ, డీసీ చైర్మన్‌లు వాసురాజు, సత్యనారాయణ, లక్ష్మీపతిరాజు, భోగేశ్వరరావు, కొండ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జేఎన్‌వీ ప్రవేశపరీక్షకు దరఖాస్తు గడువు 13

ఏలూరు అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలోకి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించేందుకు గడువును ఈనెల 13వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. జిల్లాకు 5,828 దరఖాస్తులను టార్గెట్‌గా ప్రభుత్వం నిర్ణయించగా, ఇంతవరకు 1,003 మాత్రమే ఆన్‌లైన్‌లో సమర్పించారన్నారు. డీవైఈవోలు, ఎంఈవోలు తమ పరిధిలోని విద్యార్థులు ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు.

ఒకే ఊరి నుంచి ముగ్గురు కానిస్టేబుల్స్


శీలం రాజేష్, పెచ్చెట్టి కిరణ్, కంబాల హారిక

ఆచంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం వల్లూరుకు చెందిన శీలం రాజేష్, పెచ్చెట్టి కిరణ్, కంబాల హారిక కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శీలం రాజేష్ డిగ్రీ చదివాడు. తండ్రి శ్రీనివాసు వ్యవసాయ కూలీ. బీటెక్ చేసిన పెచ్చెట్టి కిరణ్ తండ్రి పెద్దిరాజు వ్యవసాయ కూలీ. కంబాల హారిక కూడా పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా ఆమె ఇటీవల హారిక ఎస్‌ఐ పోస్టులు కూడా వెళ్లింది. కేవలం ఏడు మార్కులు తగ్గడంతో ఎస్‌ఐ పోస్టు దక్కలేదు. ఆమె తండ్రి శ్రీనివాసు కారం మిల్లు నడుపుతాడు. గ్రామానికి చెందిన ఒకేసారి ముగ్గురు పోలీసు కానిస్టేబుల్స్‌గా ఎంపిక కావడంపై గ్రామంలో పలువురు వీరిని అభినందించారు.

స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ సాధించాడు


ప్రకాష్

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంకు చెందిన యు.ప్రకాష్ స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. పట్టణంలోని కోడే వెంకట్రావు మునిసిపల్ హైస్కూల్‌లో విద్యనభ్యసించిన ప్రకాష్ పరుగు పందెంలో రాణించారు. ఆయనకు పీఈటి చింతకాయల సత్యనారాయణ శిక్షణలో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో 6 కిలోమీటర్ల పరుగుపందెంలో ఎన్నో మెడల్స్ సాధించారు. ప్రకాష్ తండ్రి అనారోగ్యంతో పనిచేయలేని పరిస్థితుల్లో తల్లి పాప తెలిసిన వాళ్ల ఇళ్లలో పనిచేస్తూ కొడుకుని ప్రోత్సహించారు.

ఆ ఊరిలో ఇద్దరు యువతులు పోలీసులే..


దుర్గాజ్యోతి, లక్ష్మీదుర్గ

మొగల్తూరు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బీటెక్ పూర్తి చేసిన కొపనాతి దుర్గాజ్యోతి పోలీస్‌శాఖలో చేరాలనే లక్ష్యంతో తొలిప్రయత్నంలోనే కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఆమె తండ్రి కొపనాతి పెద్దిరాజు కులవృత్తితో జీవిస్తున్నాడు. తల్లి ముత్యాలపల్లి గ్రామ ఎంపీటీసీగా సేవలందించారు. ఎస్‌ఐ కావడమే తన లక్ష్యమని దుర్గాజ్యోతి తెలిపింది. మండలంలోని వారతిప్ప గ్రామానికి చెందిన వల్లభుని లక్ష్మీదుర్గ కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైంది. గత ఏడాది ఎస్‌ఐ పోస్టు 8 మార్కుల తేడాతో కోల్పోవడంతో తాను కానిస్టేబుల్ పోస్టును సాధించాలని చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. వారిద్దరిని గ్రామస్తులు అభినందించారు.

ఆకివీడు మండలంలో ముగ్గురు యువకులు..


కల్యాణ్, నీలకంఠం, గణేశ్‌బాబు

ఆకివీడు / ఆకివీడు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆకివీడు పట్టణంలో ఇద్దరు, కుప్పనపూడిలో ఒక యువకుడు కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. పట్టణంలోని శ్రీరామపురానికి చెందిన బేతపూడి కల్యాణ్, సాలిపేటకు చెందిన కొల్లా నీలకంఠం (సునీల్) ఎంపికయ్యారు. పోలీసు ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో శిక్షణ పొంది పరీక్షలు రాయడంతో సెలక్టయ్యామన్నారు. మండలంలోని కుప్పనపూడి పంచాయతీ తాళ్ళకోడు గ్రామానికి చెందిన అంగర గణేశ్ బాబు ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మూడో ప్రయత్నంలో తాను విజయం సాధించినట్లు గణేశ్‌బాబు తెలిపారు. విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాసంస్థలలో పూర్తి చేసినట్లు తెలిపారు. తండ్రి లేకపోయిన తల్లి కష్టపడి చదివించిందని, హైదరాబాద్‌లో ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ తన చిన్ననాటి ఆశయమైన పోలీస్ ఉద్యోగం సాధించినట్లు ఆనందం వ్యక్తం చేశారు. అతడి ఎంపికపై గ్రామ ఉప సర్పంచ్ జన్నుగోపి, యువత హర్షం వ్యక్తం చేశారు.

జీవితంలో మరువలేనిది స్నేహ బంధం

బంధుత్వాలలో విభేదాలు రావచ్చు.. బంధుత్వాలు పలచబడి దూరంపెరగవచ్చు.. భార్యభర్తలు.. అన్నదమ్ములు.. అక్కచెల్లెలు.. ఏ బంధమైనా ఏదొక సందర్భంలో దూరంపెరగవచ్చు.. జీవిత చరమాంకం వరకు నిలిచేది.. స్నేహం మాత్రమే.. నేడు జాతీయ స్నేహితుల దినోత్సవం.

జీవితంలో ప్రతీ బంధానికి ప్రత్యేకత ఉంది. కాని వీటిలో స్నేహం చాలా ముఖ్యమైనది. వయస్సు. మతం, కులం లేని బంధం స్నేహం. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఫ్రెండ్‌షిప్ డేకు గుర్తింపు వచ్చింది.

2011లో ఐక్యరాజ్య సమతి జనరల్ అసెంబ్లీ జూలై 30న అంతర్జాతీయ స్నేహ దినోత్సవంగా ప్రకటించింది. మన దేశంలో ఆగస్టు మొదటి ఆదివారం మాత్రమే స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్నాం.

నేడు జాతీయ స్నేహితుల దినోత్సవం

పాలకొల్లు / తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదు.. ప్రస్తుత సాంకేతిక యుగంలో డిజిటల్ బంధంతో మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో స్నేహితుల దినోత్సవం ఆ దూరం తగ్గిస్తుంది. స్నేహంబంధంతో సమాజంలో కుల మత బేధాలకు తావుండదు. కష్టనష్టాల్లో ఒకరికొకరు తోడుగా ఉండడమే కాదు సమాజ సేవకు సైతం స్నేహితులు ముందుంటున్నారు. బాల్యం నుంచి కుటుంబంలో స్థిరపడే వరకు వివిధ స్థాయిల్లో స్నేహం మరపురాని అనుభూతి. యాంత్రిక జీవనంలో వ్యక్తిగత జీవనం పెరుగుతున్న పరిస్థితుల్లో స్నేహితుల దినోత్సవం సంబంధాలను బలపరుస్తుంది. కష్టంలో స్నేహితుడి ఓదార్పు, నేనున్నాననే తోడు ధైర్యంగా ముందుకు నడిపిస్తుంది.

స్నేహానికి వేదిక పాఠశాల

బాల్యం నుంచి జీవితంలో మరపురానిది స్నేహం. ఎప్పటికీ మరపురాని స్నేహానికి పాఠశాల వేదిక. పూర్వ విద్యార్థుల సమ్మేళ నాల్లో అత్యధిక శాతం పాఠశాల స్థాయి స్నేహితుల కలయిక. పదో తరగతి విద్యార్థులు ఏటా కలుస్తున్నారు.



వారి స్నేహం ఆదర్శం..

పాలకొల్లు పట్టణానికి ముగ్గురు స్నేహితుల అపూర్వ కలయిక ఎందరికో ఆదర్శం. పెన్మెత్స కేశవ రాజు, కోరాడ గోవిందరాజులు, దాసిరెడ్డి శ్రీనివాస్ బాల్యం నుంచి మంచి స్నేహితులు. ఏ పని చేసినా ముగ్గురూ కలిసి చేస్తారు. వారి వ్యాపారాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారు.


మూడు దశాబ్దాల స్నేహబంధంతో సామాజిక సేవవైపు వెళ్లిన మిత్రబృందం (ఫైల్)

సామాజిక సేవలో స్నేహితులు

స్నేహ బంధం సామాజిక సేవవైపు నడిస్తే అది 'మన ఊరు' అసోసియేషన్‌గా కనిపిస్తుంది. ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరం పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 2009లో ఒకసారి కలుసుకున్నారు. ఆ కలయికలో సరదా స్నేహబంధమే కాదు సామాజిక స్పృహ ఉంది. 2009లో ఒక సొసైటీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఒకసారి వారంతా కలుస్తూనే ఉన్నారు. ఏటా మండలంలో నాలుగు పాఠశాలలు దత్తత తీసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి మొత్తం వారే సమకూర్చి వారి హాజరు, ఉపాధ్యాయుల బోధన, విద్యలో వెనకబడిన విద్యార్థులను గుర్తించడం వంటి పర్యవేక్షణ బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వం విద్యా కిట్‌ల పంపిణీ వంటి పథకాలు లేనప్పుడే వారు షూ, బెల్టు, బ్యాగులు, పుస్తకాలు అందించారు. ఏటా రూ.లక్ష రూపాయలు వెచ్చించారు. వారి కృషితో అప్పట్లో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయి. ప్రభుత్వ పథకాలు ప్రారంభమైన తర్వాత విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలపై మిత్రులంతా దృష్టి సారించారు. 35 ఏళ్ల క్రితం నాటి స్నేహ బంధం 15 ఏళ్లుగా సామాజిక సేవలో ముందుకు వెళుతూనే ఉంది.

కలసి కష్టపడ్డారు.. కానిస్టేబుల్స్ అయ్యారు

వారిద్దరిదీ ఒకే ఊరు.. ఒకే తరగతి.. వారికి ఊహ తెలిసిన నాటి నుంచి కలిసి ఒకరికి ఒకరు తోడుగా నిలిచారు. చదువు తర్వాత కలిసే ఉద్యోగ ప్రయత్నాలు చేశారు. కలిసి కష్టపడి ఇద్దరూ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పట్టుదల, కృషి, జీవితంలో నిలదొక్కుకుకోవాలనే తపనకు నిదర్శనం తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంకు చెందిన చట్లపల్లి రవి, కుంచే శ్రీను.

ఇద్దరూ ఉద్యోగాలు సాధించిన సందర్భంలో స్నేహితుల దినోత్సవం యాధృచ్ఛికం అయినా వారికి ఎంతో ప్రత్యేకం. వారిద్దరినీ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. యువత పట్టుదలతో బాగా చదివితే ఉద్యోగాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయని దానికీ ఈ స్నేహితులిద్దరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

చిన్నప్పటి నుంచి పోలీస్ కావాలని..

మా నాన్న శ్రీను రైతు. అమ్మ గృహిణి. నేను డిగ్రి పూర్తిచేశాను. కానిస్టేబుల్ కావాలని చిన్నప్పటి నుంచి అనుకున్నా. నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి ఎంతో కష్టపడ్డాను. నేను స్నేహితుడు శ్రీను ఇద్దరం కలిసి శిక్షణ తీసుకున్నాం.

చట్లపల్లి రవి, వెంకట్రామన్నగూడెం

ఉద్యోగం సాధించాలనే కసితో..

నేను ప్రభుత్వ ఉద్యోగం అందులోనూ పోలీస్ ఉద్యోగం సాధించాలన్న కసితోనే చదువుకున్నా. నా స్నేహితుడు రవికి కూడా నాతోపాటే ఉద్యోగం రావడం ఆనందం రెట్టింపయింది. తల్లిదండ్రులు మరణించినా అక్క,బావ, నా మిత్రుడు రవితో అనుబంధం నన్ను ఈ స్థితిలో నిలిపింది.

కుంచే శ్రీను, వెంకట్రామన్నగూడెం



స్నేహితులే నా ధైర్యం

అమ్మా నాన్న పక్కన లేకుండా ఎప్పుడూ పక్క ఊరికి కూడా వెళ్లలేదు. ఇంటర్ పూర్తి కాగానే ఢిల్లీ వెళ్లాను. నాకే కాదు మా అమ్మా నాన్నకు కూడా భయమేసింది. ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీలో చేరిన నాకు స్నేహితులే ధైర్యం ఇచ్చారు. ఇప్పటివరకు కుటుంబంతో కలసి పుట్టినరోజు చేసుకోవడమే తెలిసిన నాకు మొదటిసారి స్నేహితులు సెలబ్రేట్ చేయడం మరిచిపోలేను. మా స్నేహం జాతీయ సమైక్యతను చాటుతుంది. ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, బీహార్ రాష్ట్రాల విద్యార్థులు నాకు బెస్ట్ ఫ్రెండ్స్ దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి నాకు ఒక ఫ్రెండ్ ఉన్నారు. చదువు, కెరీర్, ఆరోగ్యం, పండుగల్లో మిత్రులతో సరదా ఇంటికి దూరంగా ఉన్నాననే భావననే దూరం చేసింది.

- ఎన్.నిత్యశ్రీ, తణుకు



ఉండ్రాజవరంలో సినీ హీరో అశ్విన్ సందడి


అమ్మవారిని దర్శించుకున్న అశ్విన్

దెందులూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్వగ్రామం రావడం చాలా ఆనందమని బేబి సినిమా హీరో జారజాపు విరాజ్ అశ్విన్ అన్నారు. పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన అశ్విన్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి కనక దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎనిమిది సినిమాల్లో నటించానని, బేబీ సినిమాతో బాగా గుర్తింపు వచ్చిందన్నారు. కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నామన్నారు. విరాజ్ అశ్విన్‌కు ఎంపీటీసీ సున్నా నరేష్, గ్రామస్తులు శ్రీనివాసరావు, నకకల సూర్యచంద్రరావు, రాంబాబు, గరక గంగాధరరావు, చమద్దుల రాంప్రసాద్ కలిసి బొకేను అందజేసి గ్రామంలో సరదాగా ముచ్చటించారు.



సుర్రుమన్న సూరీడు

భీమవరంటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావం తగ్గడంతోపాటు వర్షాభావం నెలకొంది. ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు నమోదవుతున్నా 40 డిగ్రీలు ఉన్నట్లు ఫీల్ అవుతున్నారు. ఉదయం నుంచి ఉక్కపోత కనిపిస్తోంది. రెండు రోజులుగా ఇదే పరిస్థితి కానరావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవి కాలంలో స్నానంచేసిన తరువాత చెమటు ఎలా పడతాయో అదే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. రానున్న రోజుల్లో వృద్ధులకు చాలా ఇబ్బంది అని, చిన్నపిల్లలు అల్లాడిపోతున్నారని భయం వ్యక్తంచేస్తున్నారు. స్కూల్ నుంచి వచ్చే పిల్లలు చెమట, నీరసంతో కనిపిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఏసీ ఉంటే తప్ప ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం వేళ వాహనాపై ప్రయాణం చేయలేకపోవడంతో ప్రధాన రోడ్డలపై కూడా రద్దీ తగ్గిపోయింది. ఎండ తీవ్రతతో జనం బయటకు రావడినికి భయపడుతున్నారు. వాన దేవుడు కరుణిస్తేనే ప్రజలు చల్లబడేదని అంటున్నారు.


ఖాళీగా దర్శనమిస్తున్న బీవీ.రాజు విగ్రహం రోడ్డు

కనిపించని కాల్వ..!

- బక్కచిక్కుతున్న నరసాపురం పంట కాల్వ
- 27 మీటర్ల వెడల్పు నుంచి 22 మీటర్లకు కుదింపు
- కాల్వ ఆయకట్టు 1.58లక్షల ఎకరాలు
- ఎంత నీరిచ్చినా.. శివారుకు అందని పరిస్థితి


నరసాపురం-నిడదవోలు కాల్వ

నరసాపురం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): నరసాపురం-నిడదవోలు పంట కాల్వ బక్కచిక్కుతుంది, దాదాపు తొమ్మిదేళ్లుగా పూడిక పనులు చేపట్టలేదు. శివారు భూములకు పుష్కలంగా నీరందని పరిస్థితి నెలకొంది. 27 మీటర్ల ఉండాల్సిన కాల్వ నేడు 23 మీటర్లకు కుచించుకుపోయింది. కాల్వ శివారును 12 మీటర్ల వెడల్పు ఉండాల్సిన కాల్వ 8 నుంచి 9మీటర్లకు కుచించుకుపోయింది. కాల్వకు పుష్కలంగా నీరు విడుదల చేస్తున్నా... శివారు ప్రాంతాలకు ప్రవాహం సాగడం లేదు. ఫలితంగా రైతులకు నీటి ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లాలో కాకపర్రు నుంచి వీడిపోయి నిడదవోలు పంట కాల్వ మొగల్తూరు వరకు ప్రవహిస్తుంది. పెరవలి, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సుమారు 1.58 లక్షల సాగు విస్తీర్ణం ఈకాల్వ వెంబడి ఉంది. ఇంత కీలకమైన పంట కాల్వ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైఇది. రాష్ట్ర విభజన తరువాత ప్రభుత్వం నీరు చెట్టు కింద 2016లో పూడిక పనులు చేపట్టారు. అప్పటి నుంచి కాల్వ పూడిక పనులు తీయించలేదు. కాకరపర్రు నుంచి నరసాపురం వరకు 27మీటర్ల వెడల్పు ఉండాల్సిన కాల్వ చాల చోట్ల పూడికతో బక్కచిక్కింది. కొన్ని చోట్ల 24మీటర్లు, మరికొన్ని చోట్ల 22 మీటర్లు ఉంది. అలాగే శివారుకు వెళ్లే కొలది కాల్వ వెడల్పును తగ్గిస్తుంటారు. ఇది 12 మీటర్లు ఉండాల్సి ఉండగా.. కొన్ని చోట్ల 8, 9మీటర్లకు పడిపోయింది.

శివారు భూములకు నీరందని పరిస్థితి..

కీలకమైన నరసాపురం కాలువకు గోదావరి నుంచి 2280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుంటారు. నీటి ఎద్దడి ఉన్నప్పటికీ ఈ కాలువకు ఇదే లెవెల్‌ను నీటి పారుదలశాఖ అధికారులు నిర్వహించడం ఆనవాయితీ. ఎక్కువ విస్తీర్ణం, శివారు ప్రాంత భూములు ఉండడంతో పుష్కలంగా నీరందించాలని లెవల్స్‌ను తగ్గించరు. కాలువ పూడిపోవడంతో పూర్తిస్థాయి నీటిని విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ విడుదల చేసినా.. ప్రవాహం ముందుకు సాగడం లేదు. ఈకారణంగా శివారు భూములకు, కొన్ని సబ్ చానల్స్‌లకు పుష్కలంగా నీరందడం లేదన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

పూడికతీతకు ప్రతిపాదనలు

చెత్తా, చెదారం కాలువలో వేయడం వల్ల చాలా చోట్ల ప్రధాన కాల్వ పూడిపోయింది. పుష్కలంగా నీటిని విడుదల చేస్తున్నా శివారు ప్రాంతాలకు సాగునీరు అందటం లేదు. కాకరపర్రు నుంచి నరసాపురం వరకు కాల్వ తవ్వక పనులు చేపట్టారు. గతంలో కొన్ని నిధులు ద్వారా అక్కడక్కడ పూడిక తొలగించాం. పూర్తిస్థాయి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం.

- వెంకటనారాయణ, డీఈ, ఇరిగేషన్


బంగారు వాకిలి నుంచి శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

గోవింద నామాలతో శోభిల్లిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గోవిందనామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం శోభిల్లింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దాదాపు 15వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు ముందుగా మొక్కుబడులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. ఆ తరువాత నిత్యాన్నదాన సదనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

భూమి.. చెరువైంది!

మండలంలో ధాన్యాగారంగా పేరొందిన రామన్నపాలెం పేరు చెబితే పచ్చని వ్యవసాయ భూములు, చేలగట్లపై కొబ్బరి ఫలసాయంతో ఉండే అడవిపర్ర గుర్తు వస్తుంది. ఇపుడు చేలు చెరువులు అవుతున్నాయి. కొబ్బరి చెట్లు కొట్టేస్తున్నారు. పంట భూములను ఆక్వా చెరువులుగా మార్చేస్తున్నారు. అడవిపర్ర ఆయకట్టు పరిధిలో 800 ఎకరాల వరి సాగు ఉండేది. ప్రస్తుతం ఆక్వా కల్చర్ కనిపిస్తుంది. దర్భరేవు డ్రెయిన్ ముంపు వరి సాగును కబళించేసింది. ఏటా ముంపు నష్టం తట్టుకోలేని రైతుల గుండె, వ్యవసాయ భూమి చెరువైంది..

- దర్భరేవు డ్రెయిన్ ముంచేస్తోంది
- చేలను తవ్వేసిన రైతులు
- ఆక్వా చెరువులుగా మార్చేశారు
- అడవిపర్ర ఆయకట్టు దుస్థితి

మొగల్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతమైన మొగల్తూరు మండలంలో రామన్నపాలెం అడవిపర్ర రైతులను పెద్ద రైతులుగా భావించేవారు. ఇక్కడ చేలకు కంత తీస్తే సాగునీరు అందే పరిస్థితితో పాటు తక్కువ పెట్టుబడితోనే ఆశాజనకంగా వరి దిగుబడి వచ్చేంది. ఫలితంగా ఇక్కడ ఎకరం వరి చేను ఉంటే ఆకుటుంబానికి లోటు ఉండేదికాదు. వరి సాగుకు ఎంతో క్రేజ్ కలిగిన ఈ అడవిపర్ర చేలన్ని ప్రస్తుతం చేపల చెరువులుగా మారుతున్నాయి.

దర్భరేవు డ్రెయిన్ ముంపు..

అడవిపర్ర చేలల్లో ముంపునీరు లాగే దర్భరేవు డ్రెయిన్ పూడుకుపోవడంతో సముద్రం ఆటుపోటుతో డ్రెయిన్ చేలను ముంచుతోంది. కొద్దిపాటి వర్షానికే చేలల్లో నీరు లాగక సాగు చేసిన చేలు కుళ్లిపోవడం, దిగుబడి ప్రభావం చూపడం, ముంపుతో సాగు ఖర్చులు పెరిగిపోవడంతో రైతులు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. సుమారు 15 ఏళ్లగా దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని రైతులు ఆందోళనలు, క్రాప్ హాలీడే ప్రకటించినా అధికారులు, ప్రజాప్రతినిధులు డ్రెయిన్ ప్రక్షాళన వైపు కన్నెత్తి చూడలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆయకట్టు రైతులు కాళ్లరిగేలా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం కానరాలేదు. సుమారు 10 సంవత్సరాలుగా సాగు చేయకపోవడంతో అడవిపర్ర చేలు కొనేనాథుడు లేక ధరలు పడిపోయాయి. తమకు గల చేలను ఏదోరకంగా ఆదాయ మార్గంలోకి తీసుకురావాలని కొందరు రైతులు అడవిపర్ర ఆక్వాజోన్ పరిధిలోకి రాకపోయినా తమ భూములను చేపల చెరువులకు లీజుకు ఇచ్చేస్తున్నారు. ఫలితంగా 800 ఎకరాల వరి సాగు చేలల్లో సుమారు 400 నుండి 500 ఎకరాలు ఇప్పటికే చేపల చెరువులుగా తవ్వేశారు. ప్రతీ గ్రామంలో వరి చేలు ధరలు ప్రతీ ఏటా పెరుతున్నా ఒక్కడ మాత్రం ఎకరం భూమి రూ.25లక్షలకు కొనేనాథుడు లేక పెరగడం లేదు. ఒకప్పటి ధాన్యాగారం అడవిపర్రలో భూమి ధరలు తగ్గడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు.


చెరువులుగా తవ్వేస్తున్న వ్యవసాయ భూములు


ప్రక్షాళనకు నోచుకోని దర్భరేవు డ్రెయిన్



దర్భరేవు డ్రెయిన్ ముంపు కారణం

దర్భరేవు డ్రెయిన్ పూడుకుపోవడంతో పాటు ఆటు పోటుల ప్రభావంతో డ్రెయిన్ పొంగి చేలు మునుగుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేయడంతో రైతులు చేపల చెరువులకు లీజుకు ఇచ్చేస్తున్నారు.

- యాతం పాండురంగారావు, అడవిపర్ర రైతు



ఆక్వా జోన్ పరిధిలోకి తేవాలి

ముంపుతో నష్టాలు భరించలేక భూములు చేపల చెరువులకు లీజుకు ఇచ్చేస్తున్నారు. దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళన చేయలేని పరిస్థితిలో అడవిపర్ర ప్రాంతాన్ని ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకువస్తే రైతులకు మేలు.

- ఎం.పుల్లయ్య నాయుడు, సాగునీటి సంఘ ఉపాధ్యక్షుడు



పీఎం శ్రీ స్కూల్‌గా ఎంపికైనా కొవ్వలి హైస్కూల్

పీఎంశ్రీ స్కూల్‌గా కొవ్వలి ఎంపిక

దెందులూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం అమలుతో జిల్లాలో అత్యంత నాణ్యమైన విద్యతో పాటు కార్పొరేట్ స్థాయిలో ఉన్న కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎంశ్రీకు ఎంపికైంది. కొవ్వలి ఉన్నత పాఠశాల పీఎంశ్రీ మారిన తరువాత ప్రత్యేకంగా ప్రభుత్వం ముగ్గురు ఒకేషనల్ ట్రైనర్లను కేటాయిస్తారు. విద్యార్థులకు బీమా, వ్యవసాయం గృహ నిర్వాహణ తదితర వాటిపై అవగాహన కల్పిస్తారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో పాటు అత్యాధునిక ల్యాబ్, లైబ్రరీ, విశాలమైన ఆట స్థలం 39 అంశాల్లో నాణ్యత ఉండడంతో కొవ్వలి పాఠశాలను పీఎంశ్రీ పాఠశాల ఎంపిక చేసినట్లు హెచ్ఎం శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులతో పాటు సివిల్, వాహనం ప్రమాద బీమా, బ్యాంకు లావాదేవీలు కుటుంబ వివాదాలు, టెలిఫోన్ బకాయిలు, చిట్ ఫండ్ కేసులు, అమలు పిటీషన్లు (ఇపి) ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీచేయడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు అన్ని పనివేళలో ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం నిర్వహించి, కేసుల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని, కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా లేదా నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా అన్ని కోర్టుల పరిధిలోని మండల న్యాయ సేవాధికార కమిటీలను సంప్రదించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమస్యలు ఎదురైతే 15100, 08812 224555 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. ఇరుపక్షాలను సమన్వయపర్చి కౌన్సెలింగ్ నిర్వహించడానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 40 మంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 547 కేసులు లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారానికి రిఫరల్ చేయగా ఇప్పటికే వీటిలో 18 కేసులు కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించుకున్నారని తెలిపారు.



ఆలయ ముఖ మండపం వద్ద డీడీ క్రాంతికుమారి, కుటుంబ సభ్యులు

శ్రీవారి సేవలో ఆడిట్ శాఖ డీడీ క్రాంతికుమారి

ద్వారకాతిరుమల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని రాష్ట్ర ఆడిట్ డిపార్ట్‌మెంట్ జోన్-2 డిప్యూటి డైరెక్టర్ బీఆర్ క్రాంతి కుమారి శనివారం రాత్రి సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రాన్ని అందించి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఏఈవో నటరాజారావు ఆమెకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ఆరుగొలను గురుకుల పాఠశాలలో సీట్లకు ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గురుకుల పాఠశాలలో 5, 10, ఇంటర్ రెండు సంవత్సరాల్లో సీట్ల ఖాళీల భర్తీకి విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎం దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. అయిదో తరగతితో 13 సీట్లు,10వ తరగతిలో 7 సీట్ల భర్తీ, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో 7 సీట్లు, రెండో సంవత్సరం ఎంపీసీ బైపీసీలో 14 సీట్లు భర్తీ చేసేందుకు ఆహ్వానించారు. సీట్ల భర్తీ విద్యార్థుల రిజర్వేషన్ ఆధారంగా ఉంటుందని, వివరాలకు గురుకుల పాఠశాల ఫోన్ నంబర్ 9704550050కు సంప్రదించాలని సూచించారు.

5న విజయవాడలో ఉద్యోగుల సమావేశం

ఏలూరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈనెల 5న తలపెట్టిన 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీజీఈఏ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్‌వి రామకృష్ణారావు తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు, రావలసిన డీఏ, పీఆర్సీ కమిటీ ఏర్పాటు, సీపీఎస్ తదితర సమస్యలు పరిష్కారానికి ఈకార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగుల పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కార్యదర్శి ఏడీఎస్ఆర్ఎం బంగారయ్య విజ్ఞప్తి చేశారు.

సొసైటీ ఇన్‌చార్జిల పాలనా గడువు పెంపు

ఏలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో పాలకవర్గాలు లేని సహకార సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ సహకార శాఖ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పెంచిన గడువు జూలై 31తో ముగియడంతో ఏలూరు జిల్లాలో 92 సొసైటీలకు, పశ్చిమలో 60 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జుల పదవీకాలాన్ని వచ్చే ఏడాది జనవరి 30 వరకు పొడిగించారు. పర్సన్ ఇన్‌చార్జిలుగా ఉంటూ పదవీ విరమణ, బదిలీ అయిన వారి స్థానాల్లో వేరొకరికి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరు జిల్లాలో ముసునూరుకు సభ్యుడిగా సీహెచ్ రామారావు (బ్రాంచ్ సూపర్‌వైజర్), బయ్యనగూడెం, సరిపల్లికి కొయ్యలగూడెం బ్రాంచ్ మేనేజర్ జి.కనక మహాలక్ష్మిని, దొరమామిడికి కె.విజయరాజును, తిరుమలాపురానికి కేఎస్.మూర్తిని, అచ్చయ్యపాలెంకు జె.విజయరాజును నియమించారు.

ఏలూరులోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగానే జరిగింది. ముఖ్యమైన అధికారులు హాజరు కాకపోవడంపై జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటు కేంద్ర మంత్రి, ఇతర ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సక్రమంగా పనిచేయకపోతే ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు వెళ్లే అవకాశం ఉండదని, జిల్లా స్థాయి అధికారులు కూడా ఇటు వంటి సమావేశాలకు హాజరు కాకపోతే సమస్యలు ఎవరికి విన్నవించాలని ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ప్రతి జడ్పీ సమావేశానికి మూడు జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

- ఏలూరుసిటీ



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

సమర్థవంతంగా పనిచేయండి

» జడ్పీ సమావేశంలో అధికారులకు కేంద్ర సహాయ మంత్రి వర్మ సూచన » ఉన్నతాధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యేల ఆగ్రహం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి : వర్మ



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల నిధులను అందిస్తోందన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. స్థానిక సంస్థల సభ్యులకు సముచితమైన గౌరవం ఇవ్వాలన్నారు. జిల్లా అభివృద్ధికి చురుగ్గా సంబంధిత అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాలు ఎంత ముఖ్యమో ప్రజా సమస్యల పరిష్కారానికి జడ్పీ సర్వసభ్య సమావేశం కూడా అంతే ముఖ్యమైందన్నారు. ఇకపై తాను రెగ్యులర్‌గా ఈ సమావేశాలకు హాజరవుతానన్నారు. అన్నదాతా సుఖీభవ మొదటి విడత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటాల కింద రూ.7 వేలు చొప్పున ఈ రోజు రైతుల ఖాతాల్లో జమ చేయడం సంతోషదాయకమన్నారు.

కొల్లేరు సమస్యపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం : పాకా



రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యతతో కూడిన పోలవరం ప్రాజెక్టు, కొల్లేరు అంశాలున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు, కొల్లేరు సమస్య పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయన్నారు. ఇటీవల కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికారిత కమిటీ కోరిన సమాచారాన్ని సమగ్రంగా స్పష్టతతో సంబంధిత అధికారులు నివేదిస్తే ఈ విషయంపై కేంద్రంతో తాము సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భూసార పరీక్షలను నిర్వహించి ప్రాంతాలను బట్టి ఎలాంటి పంటలు పండించాలో అవగాహన పర్చాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు సీట్లు: రఘురామ



డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ రైట్ టూ ఎడ్యుకేషన్ కార్యక్రమం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కల్పించి చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పిల్లల ఫీజులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. భవిష్యత్‌లో ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులతో భర్తీ చేసేందుకు ప్రణాళిక చేయాలని విద్యాశాఖాధికారులను ఆయన ఆదేశించారు. స్థానిక సంస్థలు బలోపేతం కావాలని ఆయన ఆ కాంక్షిస్తూ జడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఇకపై సాధ్యమైనన్ని సమావేశాలకు హాజరవుతానన్నారు.

సమస్యలపై చర్చకు వేదిక : పద్మశ్రీ



జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యులు, డిప్యూటి స్పీకర్, ప్రభుత్వ విప్, ఏలూరు జిల్లా కలెక్టర్, జడ్పీటీసీలకు, ఎంపీపీలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశం ముందస్తు సమాచారం అందించడం జరుగుతోందని ఈ దృష్ట్యా ప్రతి అధికారి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అప్పుడే ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అన్నీ అమలు చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నలు మేలు చేసే కార్యక్రమంగా ఆమె పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు ఎన్నో కల్పిస్తున్నామన్నారు. పోలీస్ రిక్రూట్ మెంట్‌లో 6100 ఉద్యోగాలు ప్రభుత్వం కల్పించిందన్నారు.

అధికారుల గైర్హాజరుపై విచారిస్తాం : కలెక్టర్



జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాతా సుఖీభవ పథంకలో వివిధ శాఖల అధికారులు ప్రత్యేకా దికారులుగా హాజరయ్యారన్నారు. ఈ సమావేశానికి కొంతమంది హాజరుకావడం ఆలస్యం జరిగిందని , ఇది కాకుండా వేరే కారణం చేత హాజరుకాని అధికారులకు సంబంధించి విచా రణ చేస్తామన్నారు.

నానో యూరియాను ప్రోత్సహించాలి : బొలిశెట్టి



రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ చర్యలు మూలంగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. పెన్షన్ పెంపు, అన్నక్యాంటీన్లు, పునరుద్ధరణ, మత్స్యకారుల భరోసా, దీపం పథకం, కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు ఈ రోజు అన్నదాతా సుఖీభవ కింద రైతులకు మొదటి విడత పెట్టుబడి రాయితీ అందించడం జరిగిందన్నారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని అదే సమయంలో రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

జాతీయ జెండా ఎగురవేసే అవకాశమివ్వండి : జడ్పీటీసీలు

సమావేశంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు తమ సమస్యలను విన్నవించారు. ఈ సారి ఆగస్టు 15 రోజున జాతీయ జెండా ఎగురవేసే అవకాశాన్ని కల్పించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జడ్పీటీసీలకు ఈ అవకాశం ఉండేదని, గత ప్రభుత్వం మాత్రం జడ్పీటీసీలకు ఆ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడైనా పరిశీలించాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యేలు కూడా జడ్పీటీసీలకు జాతీయ పతాకం ఎగురవేసే అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, కొవ్వూరు ఆర్డీవో సుస్మితారాణి, పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎం శ్రీహరి, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడో కన్ను

» నేరస్థులకు సింహస్వప్నంగా డ్రోన్ టెక్నాలజీ » పోలీస్ శాఖలో కొత్తగా డీజేఐ మేట్రిక్స్ 4 త్రీ డ్రోన్



డీజేఐ మేట్రిక్స్ 4-త్రీ డ్రోన్

పిల్లలు అదృశ్యమయ్యారంటూ ఫిర్యాదు అందిన క్షణంలోనే నగరం అంతా గాలించడం అంత సులువుకాదు. కానీ ఏదైనా టెక్నాలజీతోనే సులువుగా తమ పనులను సమర్ధవంతంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఐఐటీలో ఇంజనీర్‌గా పట్టభద్రులై కొంత కాలం ఏఐ విభాగంలో సీనియర్ శాస్త్రవేత్తగా నాలుగేళ్లు సేవలందించి ఆ తరువాత ఐపీఎస్ అధికారిగా ఎంపికై ప్రజలకు నేరుగా సేవలు అందించాలని నిర్ణయించుకున్న యువ ఐపీఎస్ అధికారి కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఏలూరు జిల్లా ఎస్పీగా సేవలందిస్తున్నారు. ఐఐటీ టెక్నాలజీలో పట్టభద్రులు కావడంతో ఆ దిశగా టెక్నాలజీ ఉపయోగించి సేవలందించాలని చర్యలు చేపట్టారు. జిల్లాలో డ్రోన్లను వినియోగించడం చేపట్టారు.

ఏలూరు క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డ్రోన్ల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది కావడంతో పలువురు వ్యాపారవేత్తల సహకారంతో పోలీసు శాఖలో డ్రోన్లను ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా కొంత మంది పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ డ్రోన్లు నిరంతరం జిల్లాలో వినియోగించే నిమిత్తం ప్రతి సబ్‌డివిజన్‌లో ఏర్పాటు చేశారు. జిల్లాలో ఏడు పగటి వేళ డ్రోన్లు ఉండగా, రాత్రి వేళ డ్రోన్లు మరో నాలుగు ఉన్నాయి.

డీజేఐ మేట్రిస్ 4 త్రీ డ్రోన్ ప్రత్యేకతలేంటి?

వీటిలో అత్యంత శక్తివంతమైంది అత్యాధునిక పరిజ్ఞానం కల్గిన డీజేఐ మేట్రిస్ 4 త్రీ డ్రోన్‌ను పోలీస్ శాఖలో ఏర్పాటు చేశారు. ఈ డ్రోన్ 20 కిలోమీటర్ల పరిధి వరకూ వెళ్ళి వస్తుంది. ఐదు కిలోమీటర్ల ఎత్తు ఆకాశంలోకి ఎగిరి ఆకాశం నుంచి డేగ కన్నులా భూమిపై ఉన్న చిన్న వస్తువునైనా ఇట్టే పరిశీలించి 200 జూమ్ పవర్‌ను వినియోగిస్తుంది. నాలుగు కిలోమీటర్ల పరిధి వరకూ స్పష్టమైన చిత్రాలను, అతి సూక్ష్మమైన వస్తువును సైతం చూపించగలుగుతుంది. స్మార్ట్ ట్రేకర్ సిస్టమ్ ద్వారా ఏదైనా అనుమానాస్పద ఒక కారు నెంబర్ డ్రోన్‌కు అందిస్తే ఆ కారు ఏఏ ప్రాంతంలో ఉందో, 20 కిలోమీటర్ల పరిధిలో క్షణంలో పసిగడుతుంది. అంతేకాకుండా అదృశ్యమైన ఒక బాలుడి చిత్రాన్ని ఆ డ్రోన్‌కు అందిస్తే ఎక్కడ ఉన్నాడో ఇట్టే పసిగట్టి అందించగలదు. రాత్రి వేళ ఈ డ్రోన్ ఆకాశంలో ఉన్నా ఎవ్వరికీ కనిపించదు. 20 కిలోమీటర్ల దూరం వరకూ తన కెమెరా కళ్ళతో పసిగడుతూ త్రీడి జూమ్‌తో చూపిస్తుంది. చీకటిలో దాక్కుని ఉన్న వారిని సైతం థర్మల్ కెమెరా ద్వారా గుర్తించి పట్టపగలు చూసినట్లుగానే వీడియో, ఫోటోలను చూపిస్తూనే ఉంటుంది. ఇంకా ఏదైనా ప్రాంతంలో అనుమానాస్పద వ్యక్తులు తచ్చాడుతూ ఉంటే వెంటనే సిగ్నల్స్ అందిస్తుంది. ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వాహనాలను పార్కింగ్ చేస్తే ఈ డ్రోన్ గుర్తిస్తుంది. నేరుగా ఆ వాహనాలు ఉన్న ప్రాంతం వద్దకు వెళ్ళి పోలీస్ సైరన్‌తో హెచ్చరికలు జారీ చేస్తుంది. అప్పటికీ వాహనాలను తీయకపోతే ఆపరేటర్, సిస్టమ్ ఎడ్మిన్లు నేరుగా మాట్లాడుతూ మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తారు. ఒక అనుమానాస్పద వాహనం ఉంటే అది ఎక్కడికి వెళ్తుందో కూడా ఆ వాహనాన్ని ఛేజ్ చేస్తుంది. అది వెళ్ళే మార్గాన్ని పోలీసులకు అందిస్తుంది. ఇంత టెక్నాలజీ కలిగిన డ్రోన్‌ను జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఏలూరు జిల్లాలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దీనిని ఏలూరు నగరం, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో 24 గంటలు వినియోగిస్తున్నారు. ఈ కెమెరా పనితీరును ఇటీవల రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు ఎస్పీ కిషోర్ స్వయంగా వివరించారు.

- ఇటీవల రాత్రి వేళ మద్యం తాగుతున్న పది మందిని ఈ డ్రోన్ గుర్తించడంతో వారిని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు.
- ఇటీవల ఆశ్రం ఆసుపత్రి సమీపంలో విటులను ఆకర్షిస్తూన్న మహిళలను ఈ డ్రోన్ గుర్తించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.
- రాత్రి వేళ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి కాపర్‌వైరు అపహరించుకుపోతున్న ముఠాలపై ఈ డ్రోన్‌తో ప్రత్యేక నిఘా పెట్టించారు.
- ఏలూరుకు 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫారమ్ వద్ద అనుమానంగా ఉంటే క్షణంలో గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందిస్తుంది.



మద్యం తాగుతున్న వారిని గుర్తించిన డ్రోన్, అదుపులోకి తీసుకున్న పోలీసులు(ఫైల్)

ప్రజల భద్రతే ధ్యేయం



జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, నేర నియంత్రణకు టెక్నాలజీతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. దీనిలో భాగంగానే డ్రోన్లను జిల్లాలో వినియోగిస్తున్నాం. ఇప్పటికే 30 శాతం వరకూ నేరాలను అదుపు చేయగలిగాం. రోడ్డు ప్రమాదాలు కూడా నియంత్రించగలిగాం. ఫేస్ రికగ్నైజింగ్ సీసీ కెమెరాలు కూడా జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. వీటి ద్వారా కూడా నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నాం. పగలు, రాత్రి వేళ డ్రోన్లతో నిఘా పెట్టి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాం. డ్రోన్ల ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. ప్రజలు తమ విలువైన వస్తువులను కాపాడడం కోసం, తమ ఇంటికి, వ్యాపార సంస్థలకు రక్షణ కల్పించుకోవడం కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఒక వేళ నేరం జరిగినా ఆ కెమెరాల్లో ఉన్న ఫుటేజిని బట్టి నేరస్తుడిని త్వరితగతిన అరెస్టు చేసి చోరీ సొత్తును పూర్తిస్థాయిలో రికవరీ చేయడానికి ఆస్కారం ఉంది. సాధ్యమైనంత వరకూ వైఫైతో ఉన్న తక్కువ ఖర్చుతో కూడిన సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా రక్షణ కల్పించుకోవచ్చు.

-జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్



ప్రమాద దృశ్యం సాజన్ మృతదేహం



వ్యాన్‌లోనే ఇరుక్కుపోయి మృతి చెందిన మహబూబ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

ద్వారకాతిరుమల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అతివేగం, నిర్లక్ష్యం, నిద్ర మత్తు రెండు నిండు ప్రాణాలను బలి గొన్నాయి. మండలంలోని లైన్ గోపాలపురం వద్ద రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ముందు వెళ్తున్న ఇసుక లోడు లారీని వేగంగా కోళ్లలోడు వ్యాను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరోవ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం సాయంత్రం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన షేక్ మీరా మహబూబ్ (30) తాను పనిచేసే పౌల్ట్రీలోనే పనిచేస్తున్న సౌత్ ఢిల్లీకి చెందిన మహ్మద్ సాజన్ (27), బిహార్‌కు చెందిన కలిమ్ ఆలాంతో కలసి ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో కోళ్లలోడుతో తాడేపల్లికి బయలు దేరాడు. లైన్ గోపాలపురం బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ముందువెళ్తున్న ఇసుక లోడు లారీని అతివేగంతో ఢీకొట్టాడు. వ్యాన్ ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. క్రేన్ సాయంతో పోలీసులు వాహనాలను విడదీసి అందులో చిక్కుకున్న డ్రైవర్ మీరా మహబూబ్, సాజన్ మృతదేహాలను బయటకు తీశారు. గాయాలపాలైన ఆలాంను భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భీమడోలు సీఐ విల్సన్, ఎస్ఐ సుధీర్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వివరాలను సేకరించారు. మృతుడు మీరా మహబూబ్ తొమ్మిదేళ్లుగా తాడేపల్లిలోని ఓ పౌల్ట్రీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మహబూబ్ సోదరుడు షేక్ ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 7 లక్షలకు టోపీ

ముదినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తనకు నాయకులు బాగా తెలుసునని వాళ్ళ కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ఉద్యోగం గ్యారెంటీగా ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి గ్రామానికి చెందిన బూషే చిరంజీవి స్థానికంగా ప్రైవేటుగా డ్రైవర్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతను డిగ్రీ పాస్ అయిన తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అదే గ్రామానికి చెందిన పి. విక్రమ్ అనే వ్యక్తి ఏడాది క్రితం తాను వైసీపీ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, నారాయణ రాజు కార్లకు డ్రైవర్‌గా పనిచేస్తున్నానని కొంత సొమ్ము కడితే తాను ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్న చిరంజీవి విడతల వారీగా విక్రమ్‌కు రూ. 7 లక్షల సొమ్మును ముట్టజెప్పాడు. అయితే ఉద్యోగం మాత్రం ఇప్పించలేదు. చాలా కాలం నుంచి అడుగుతున్నప్పటికీ ఉద్యోగం వేయించకపోగా ఇచ్చిన సొమ్ము కూడా తిరిగి ఇవ్వకపోవడంతో తాను మోసపోయానని గుర్తించిన చిరంజీవి శనివారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు బేళ్ల చోరీ కేసులో నలుగురి అరెస్టు

టి.నర్సాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బ్యారన్ పొగాకు బేళ్ల చోరీకి పాల్పడిన నలుగురు నిందితుల ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కృష్ణాపురానికి చెందిన భూక్యా భాస్కరరావుకు చెందిన 14 పొగాకు బేళ్ల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా చోరీ పొగాకు బేళ్లను, నలుగురు నిందితులను గుర్తించి పొగాకు బేళ్లు, వాటి కోసం వాడిన అశోక్ లేలాండ్ వాహనాన్ని సీజ్ చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వీక్లీ స్పెషల్ ట్రైన్ల పొడిగింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వీక్లీ స్పెషల్ ట్రైన్స్‌ను పొడిగిస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైల్ నెంబర్ 08547 విశాఖపట్టణం నుంచి తిరుపతి ప్రతి బుధవారం వెళ్లే రైలు ఆగస్టు ఆరవ తేదీ నుంచి సెప్టెంబర్ 24వ తేదీ వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 08548 తిరుపతి నుంచి విశాఖపట్టణం ప్రతి గురువారం వెళ్లే ఈ రైలు ఆగస్టు 7వ తేదీ నుంచి సెప్టెంబర్ 25 వరకూ, రైల్ నెంబర్ 08579 విశాఖపట్టణం నుంచి చెర్లపల్లి ప్రతి శుక్రవారం వెళ్లే రైలును ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 26 వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 08580 చర్లపల్లి నుంచి విశాఖపట్టణం ప్రతి శనివారం వెళ్లే ఈ రైలును ఆగస్టు 9వ తేదీ నుంచి సెప్టెంబర్ 27 వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 02863 సత్రగంజి నుంచి యశ్వంత్‌పూర్ ప్రతి గురువారం వెళ్లే రైలును ఆగస్టు 7వ తేదీ నుంచి ఆగస్టు 28వ వరకూ పొడిగించారు. 08864 యశ్వంత్‌పూర్ నుంచి సత్రగంజి ప్రతి శనివారం వెళ్లే ఈ రైలును ఆగస్టు 9వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 01435 షోలాపూర్ నుంచి ఎల్‌టీటీ ముంబై ప్రతి మంగళవారం వెళ్లే ఈరైలును ఆగస్టు 5వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 01436 ఎల్‌టిటి ముంబై నుంచి షోలాపూర్ ప్రతి బుధవారం వెళ్లే ఈ రైలు ఆగస్టు 6వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 06519 ఎస్ఎంవిటి బెంగుళూరు నుంచి బీదర్ ప్రతి గురువారం వెళ్లే రైలును ఆగస్టు 14 వరకూ పొడిగించారు. 06520 బీదర్ నుంచి ఎస్ఎన్‌విటి బెంగుళూరు ప్రతి శుక్రవారం వెళ్లే ఈరైలు ఆగస్టు 15 వరకూ పొడిగిస్తూ శనివారం రాత్రి దక్షిణమధ్య రైల్వే అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

ఏలూరు క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విసన్నపేటలోని ఒక వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి ఏలూరు తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని, విసన్నపేటలోని వ్యక్తిని ఏలూరు టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు పెన్షన్ లైను ప్రాంతానికి చెందిన తుపాకుల హరీష్ కుమార్, వాడాది ప్రశాంత్(19), మరో 17 ఏళ్ళ బాలుడు కలిసి విసన్నపేట వెళ్లి విసన్నపేట మండలం చీపురువారిపాలేనికి చెందిన గరికపాటి మోహనసాయి(30) వద్ద గంజాయి కొనుగోలు చేసి ఏలూరు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం ఉన్నతాధికారులకు అందడంతో జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిఘా పెట్టారు. విసన్నపేట నుంచి గంజాయి కొనుగోలు చేసుకుని వచ్చి విక్రయిస్తున్న తుపాకుల హరీష్‌కుమార్, వాడాది ప్రశాంత్, మరో 17 ఏళ్ళ బాలుడిని అరెస్టు చేశారు. వీరికి గంజాయి విక్రయించిన చీపురువారిపాలేనికి చెందిన గరికపాటి మోహనసాయిని కూడా అరెస్టు చేశారు. వీరి నుంచి 600 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్.. పలువురికి గాయాలు

ఆకివీడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఆటోను బలంగా ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్‌తో పాటు, ప్రయాణికులకు గాయా లయ్యాయి. ఆకివీడులోని అమృతరావునగర్ కాలనీకి చెందిన ఉండుర్తి ప్రసాద్ తన ఆటోలో భీమవరంలో ప్రయాణికులను ఎక్కించుకుని ఆకివీడు వెళ్తుండగా అజ్జమూరు వచ్చే సరికి ట్రాక్టర్ ఢీకొట్టింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా అతి వేగంతో ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ప్రసాద్‌తో పాటు పాసింజర్లకు గాయాలయ్యాయి. డ్రైవర్ ఫిర్యాదుతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు

ఏలూరుక్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఒక మహిళ తిరిగి కనిపించలేదని ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం వైఎస్ఆర్ కాలనీకి చెందిన రాయచోటి పాపాయమ్మ(52)ఈ నెల ఒకటిన పదిన్నర సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాలేదు.దీంతో కుటుంబ సభ్యులు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు యర్రమళ్ల ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో మార్పులు

ఉంగుటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యర్రమళ్ల ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉంగుటూరు, చేబ్రోలు సబ్‌స్టేషన్ల పరిధిలో గృహావసరాలకు, పరిశ్రమలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరా ఉంటుందని ఈ ఈ.కే.ఎం.అంబేద్కర్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్ తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 8 గంటల వరకు, మిగిలిన నాలుగు గంటలు మధ్యాహ్నం 2 నుంచి సాయింత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. ఉంగుటూరు, చేబ్రోలు ఫీడర్ గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్పీ

భీమడోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు విచ్చలవిడిగా పెరుగుతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు పేర్కొన్నారు. భీమడోలులో శనివారం మాధురి కళాశాల నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్పీ, డీఎస్పీలు హాజరయ్యారు. సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్, ఎస్ఐ సుధాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నర్తన బాల అవార్డుల ప్రదానం

ఏలూరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఏలూరు వైఎంహెచ్ఏ హాల్లో 10వ జాతీయ స్థాయి నర్తనబాల అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు అంబికా కృష్ణ, మనోహర్ గోపాల్ లూనాని, నాట్యాచార్య దువ్వి హేమసుందర్ తెలిపారు. హేమసుందర్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 70 మంది చిన్నారులు ఈ అవార్డులకు అందజేస్తామన్నారు. వీరితో పాటు నృత్య రంగంలో ప్రతిభ కనబరుస్తూ ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో 580కి పైగా మార్కులు సాధించిన 12 మంది నృత్యరంగం చిన్నారులకు అభినయ విద్యా పురస్కారాలు అందజేస్తామని ఆయన తెలిపారు.

కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేవలు విస్తరిస్తాం : ప్రసాద్

ఏలూరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ది ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్(టెకు) 112 వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ కస్టమర్లకు సేవలు మరింత విస్తృతం చేయడానికి శ్రీకారం చుట్టినట్టు ఆ బ్యాంకు చైర్మన్ అంబికా ప్రసాద్ తెలిపారు. బ్యాంకు స్థాపించి 112 వసంతాలైన సందర్భంగా ఏలూరులోని బ్యాంకు ఆవరణలో శనివారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ది ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వ్యవస్థాపకులు వల్లూరి రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అంబికా ప్రసాద్ మాట్లాడుతూ కస్టమర్ల బ్యాంకింగ్ అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చడానికి త్వరలో తణుకు, గుంటూరు, అనకాపల్లిలో బ్యాంక్ బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. సేవల విస్తృతికి ఈ ఏడాది డిసెంబర్ నాటికి విశాఖపట్నం, బాపట్ల, పల్నాడు జిల్లాలో టేకు బ్యాంకు సేవలు విస్తరించనున్నట్టు ప్రకటించారు. బ్యాంకు సీఈవో ఎం.అచ్యుతరావు, ఉపాధ్యక్షులు ఎన్ రామారావు, బీవీ గంగా సరళ, సిహెచ్ ఆంజనేయస్వామి, ఎస్‌కె షాబీర్ హుస్సేన్, బ్రాంచ్ మేనేజర్ కే చక్రధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకోసం ఈ నెల 5వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎస్.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్‌లో సీట్లు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. టెన్త్ పాసై ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని రావాలని సూచించారు. దరఖాస్తు ఈ నెల 4వ తేదీ లోపు నేరుగా జంగారెడ్డిగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు సంవత్సరానికి రూ.4700 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ మొబైల్ నెంబర్ 90102 22162కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

'చిర్రి బాలరాజు అవినీతిపై చర్యలు తీసుకోవాలి'

బుట్టాయగూడెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అవినీతిపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు ఎ.రవి, తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఏడాదిలోనే రూ.100 కోట్లతో అవినీతికి పాల్పడినట్లు టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమా, ఏలూరు జిల్లా జనసేన నాయకుడు కరాటం రాంబాబు మధ్య జరిగిన ఫోన్ సంభాషణ పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. వారు మాట్లాడిన ఆడియో బయటకు రావడం సంచలనంగా ఉందని, పెద్ద మొత్తంలో నియోజకవర్గంలో అవినీతి జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందన్నారు. ఎమ్మెల్యేపై గతంలో కూడా ఆరోపణలు వచ్చాయని వాస్తవాలను పరిశీలన చేయాలన్నారు. వార్తలు రాసిన విలేకరులపై కేసులు పెట్టి బెదిరించారని వీటన్నింటిపైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ చేయాలని కోరారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

ఏలూరు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి వ్యవసాయరంగంతో ముడిపడి ఉందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. లింగపాలెంలో శనివారం జిల్లా కార్యదర్శి ఎం.జీవరత్నంతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల10, 11, 12 తేదీల్లో మండలంలోని ధర్మాజీగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయకార్మిక సంఘం ప్రతినిధులు హాజరవుతారన్నారు. శిక్షణ తరగతులకు మండలంలో ఉన్న విద్యావేత్తలు, మేధావులు, కార్మికులు, రైతులు, వ్యాపారవేత్తలు, మేధావులంతా హాజరవ్వాలన్నారు.

పశ్చిమ ఏజెన్సీకి ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా లేదా?

▸ ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం ఎదుట యువత ఆవేదన

బుట్టాయగూడెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ ప్రాంతానికి ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా ఎస్టీ రిజర్వేషన్‌లో ఖాళీ లేదా అంటూ ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఎదుట గిరిజన యువత తమ గోడును వెళ్లబోసుకున్నారు. శనివారం కె.ఆర్.పురం ఐటీడీఏలో జరిగిన ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయనను అడ్డుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. కానిస్టేబుల్ పరీక్షలో 80, 90, 100 మార్కులు తెచ్చుకున్నా ఉద్యోగం రాలేదని, రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీ రిజర్వేషన్‌లో గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలు వస్తే ఏలూరు జిల్లా ఏజెన్సీలో ఒక్కటంటే ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇతర జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతం గిరిజన అభ్యర్థులకు 70 మార్కులు వచ్చినా ఉద్యోగం వచ్చిందని ఏలూరు జిల్లా గిరిజనులు ఏ పాపం చేశారని ఉద్యోగాలు లేకుండా పోయాయని వాపోయారు. ఉద్యోగాలు ప్రకటనలో ఏజెన్సీకి ప్రత్యేక నియమాకాలు ఉంటాయని ప్రకటించారని రెండు రోజుల క్రితం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో మాత్రమే గిరిజన అభ్యర్థులకు అవకాశాలు వచ్చాయని రిజర్వేషన్‌లో ఎటువంటి నియామకాలు జరగలేదన్నారు. చైర్మన్ బొరగం మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

విద్యార్థి లక్ష్మణ్ కృషిని అభినందించిన ఎమ్మెల్యే ధర్మరాజు



ఉంగుటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తులో సాంకేతిక రంగంతో వినూత్న ప్రయోగాలు చేసి తమ ప్రతిభను చాటుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని గణపవరం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన ఆకుల లక్ష్మణ్(సీఎస్సీఈ) రూ.లక్షతో పాత బైక్‌ను పూర్తిగా రీ మోడల్ చేయడంతో పాటు ఎలక్ట్రిక్ బైక్‌గా రూపొందించారు. ఎమ్మెల్యే ధర్మరాజు క్యాంపు కార్యాలయంలో పరిశీలించి లక్ష్మణ్‌ను అభినందించారు.

రంగమణి మృతికి సీపీఎం సంతాపం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):శనివారపుపేటకు చెందిన సీపీఎం నాయకురాలు గొట్టాపు రంగమణి శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో తన నివాసంలో మృతి చెందారు. సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పి.వి.రామకృష్ణ, పంపన రవికుమార్, బి.బలరాం, ఎ.రవి బృందం రంగమణి పార్థీవ దేహంపై సీపీఎం జెండాను ఉంచి నివాళులర్పించారు. కంది విశ్వనాథం, జి.శివ కుమార్, ఎస్.ఎన్.రమేష్, సుధాకర్, కె.ఆంజనేయులు, కోటేశ్వరరావు ఉన్నారు.

అభద్రతలో.. అమ్మతనం!

(5వ పేజీ తరువాయి)

క్లినిక్‌లో గర్భధారణకు ప్రాథమిక వైద్యపరీక్షలను మాత్రమే చేయాలి. లెవెల్-2 క్లినిక్‌లలో అడ్వాన్స్‌డ్ వైద్యపరీక్షలు, పునరుత్పత్తి ప్రక్రియలను చేయవచ్చు. ఏఆర్టీ బ్యాంక్‌లలో దాతనుంచి వీర్యాన్ని(స్పెర్మ్) సేకరించి భద్రపర్చవచ్చు. వీటిని ఏర్పాటు చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని నిర్ణీత రుసుం చెల్లించాలి. కలెక్టర్ అధ్యక్షతన గల జిల్లా బోర్డులో డీఎంహెచ్‌వో వైస్ చైర్మన్‌గా,ఒక మహిళా సంఘం ప్రతినిధి, న్యాయనిపుణుడు, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ సభ్యులుగా వున్న కమిటీ పరిశీలించి, ఐసీఎంఆర్ చెక్‌లిస్టు ప్రకారం అన్ని నిబంధనలను పాటించిన వాటికి ఐదేళ్ల కాలపరిమితితో కూడిన అనుమతినిస్తుంది. ఇన్‌ఫెర్టిలిటీ/ఏఆర్టీ/సరోగసీ విధానంలో గర్భధారణ కోసం క్లినిక్‌లకు విచ్చేసే దంపతుల వివరాలు, వారికందించే వైద్యం, మందులు, సరోగసీ తల్లి వివరాలు, తదితర సమగ్ర సమాచారాన్నంతటినీ ఎప్పటికప్పుడు నిర్వాహకులు నేషనల్ రిజిస్ట్రీలో నమోదు చేయడంతో పాటు, డీఎంహెచ్‌వో కార్యాలయానికి తెలపాలి. ఏఆర్టీ లెవెల్-1 క్లినిక్‌లో గైనకాలజిస్టు, ఆండ్రాలజిస్టు, మోటివేటర్ తప్పనిసరిగా ఉండాలి. లెవెల్-2 క్లినిక్‌లో డైరక్టర్, అనస్థటిస్టు, గైనకాలజిస్టు, ఆండ్రాలజిస్టు ఉండాలి. ఏఆర్టీ/సరోగసీ విధానంలో పేషెంట్ల నుంచి ఆయా సేవలకు వసూలు చేయడానికి అధికారికంగా ఫీజులను ప్రభుత్వం నిర్ణయించలేదు. ఫలితంగా దంపతుల అవసరతను బట్టి సగటున ఒక్కో సరోగసీ కేసుకు రూ.ఎనిమిది నుంచి రూ.10 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలోనే వసూలు చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ

రైతుల బ్యాంకుల ఖాతాల్లో నగదు జమ
పలు చోట్ల ప్రారంభించిన ఎమ్మెల్యేలు



నమూనా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు దేశానికి వెన్నెముక అని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో భాగంగా చొదిమెళ్లలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నియోజకవర్గంలో 998 మంది లబ్ధిదారులకు 69లక్షల 86వేలు రైతులకు అందించనున్నారన్నారు.ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా చైర్మన్ శివ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకట రత్నం, తహసీల్దార్ కె.గాయత్రీ, కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కే.వంశీకృష్ణనాయకులు రెడ్డి నాగరాజు, యడ్లపల్లి శివ, నాగభూషణం పాల్గొన్నారు.

● దెందులూరు: సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు దెందులూరు నియోజకవర్గంలో 19వేల 950 మంది రైతులకు గాను అన్నదాత సుఖీభవతో పాటు పీఎం కిసాన్ నిధులు కలిపి మొత్తం రూ.13 కోట్ల 16 లక్షల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. శనివారం పోతునూరు స్వరాజ్ భవన్‌లో నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ మొదటి విడత పథకాన్ని టీడీపీ గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, బ్యాంక్ చైర్మన్ బొడ్డేటి మోహన్‌బాబు, మండలాధ్యక్షులు మిల్లు బాబులతో కలిసి చింతమనేని ప్రభాకర్ చెక్‌ను విడుదల చేశారు. నియోజకవర్గ పరిశీలకులు గాంధీ, వ్యవసాయ శాఖ ఏడీ, ఏఈ శ్రీనివాస రాజుల ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ సుమతి, నాయకులు తాతా సత్యనారాయణ, బొప్పన సుధా పాల్గొన్నారు.

● చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ అర్హులు 36 వేల 818 మందిని గుర్తించారు. వీరికి 24.55 కోట్ల రూపాయలు మొదటి విడత విడుదల చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. జిల్లాలో అత్యధికంగా చింతలపూడి నియోజకవర్గంలో అర్హులైన రైతులు ఉన్నారని, నియోజకవర్గ వ్యాప్తంగా చింతలపూడి మండలంలో అధికంగా ఉన్నారని తెలిపారు. మండలాల వారీగా చూస్తే చింతలపూడి మండలంలో 12వేల 383 మంది రైతులకు 8 కోట్ల 10 లక్షలు, లింగపాలెం మండలంలో 8వేల 244 మంది రైతులకు 5 కోట్ల 60 లక్షలు, జంగారెడ్డిగూడెం మండలంలో 8వేల 120 మంది రైతులకు 5 కోట్ల 46లక్షలు, కామవరపు కోట మండలంలో 8 వేల 9 మంది రైతులకు 5కోట్ల 38 లక్షలు విడుదలయ్యాయన్నారు. తొలి విడతగా రూ.7వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమయ్యాయన్నారు.

● ఉంగుటూరు: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం పాతూరి కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని నియోజకవర్గ స్థాయిలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమన్నారు. రూ.6 వేలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు జోడించి మూడు విడతల్లో రూ.ఇరవై వేలు జమ చేయనుందన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అయ్యప్ప, చేబ్రోలు సొసైటీ చైర్మన్ కడియాల రవి శంకర్, ఉంగుటూరు సర్పంచి బండారు సింధు మధు, అడపా శోభారాణి, వేములపల్లి సుధీర్ పాల్గొన్నారు.

● కుక్కునూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తుందని టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. శనివారం కుక్కునూరులో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, బీజేపీ నాయకులు లక్ష్మణాచార్యులు, రమణరాజు, హరిబాబు, వెంకన్నబాబు పాల్గొన్నారు.

● లింగపాలెం: సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి అని చింతలపూడి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. లింగపాలెంలో ఆయన రైతులలో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సీఎం చంద్రబాబు రైతులకు తొలి విడతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడువేలు రైతుల ఖాతాల్లో జమ చేశాయన్నారు.

● బుట్టాయగూడెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు అన్నారు. కె.ఆర్.పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం పోలవరం నియోజకవర్గస్థాయిలో రైతులతో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ఎమ్మెల్యే, చైర్మన్ పాల్గొని ప్రారంభించారు. నియోజకవర్గంలోని రైతులకు పథకంలో రూ. 22.77 కోట్లను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఏడీఏ బుజ్జిబాబు, నాయకులు పారేపల్లి రామారావు, వెంకటేశ్వరావు, పారేపల్లి నరేష్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ అన్నారు. శనివారం కామవరపుకోటలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో రైతులు, టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. కిషోర్ మాట్లాడుతూ చంద్రబాబు రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇవ్వండి : ఎస్ఎఫ్ఐ

ఏలూరు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ కోర్సుల్లోకి అడ్మిషన్లు ఇప్పటికే దాదాపు పూర్తికాగా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేయకపోవడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మూతపడే పరిస్థితులు నెలకొన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ఆరోపించారు. రెండ్రోజుల పాటు ఏలూరులో జరిగే ఎస్ఎఫ్ఐ సిటీ ప్లీనరీ సమావేశాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు ఎదురు చూస్తున్న విద్యార్థులు కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రైవేటు కళాశాలల్లో చేరిపోయారన్నారు. గతేడాది జూలైలోనే డిగ్రీ అడ్మిషన్లను పూర్తిచేసిన ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు వచ్చినా ఎందుకు చేపట్టలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డిగ్రీలో ఇప్పటికే నెలకొన్న సమస్యల వల్ల రాష్ట్రంలో పలు కళాశాలలు మూతపడేస్థితికి తెచ్చారని ఆరోపించారు. జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను వారం రోజుల్లో భర్తీ చేస్తానని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఇచ్చిన హామీ 15 రోజులు కావస్తున్నా టీచర్ల కొరతను భర్తీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. విద్యాశాఖ వైఫల్యం వల్ల ఈ రెండు మండలాల్లో విద్యార్థుల హాజరు శాతం దారుణంగా పడిపోతోందని, డ్రాపవుట్ల సంఖ్య కూడా ఎక్కువయ్యే ప్రమాదం నెలకొందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.మనోజ్, ఉపాధ్యక్షుడు శివాజీ, శివరాజా పాల్గొన్నారు.



రాఘవ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ

బళ్లారి రాఘవ స్ఫూర్తి ప్రదాత

ఏలూరు క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగ పితామహుడు, గొప్ప న్యాయవాది, నిస్వార్థ కళాసేవకుడు బళ్ళారి రాఘవ నాటక రంగం ద్వారా సామాజిక మార్పులకు దోహదపడిన గొప్పవ్యక్తి అని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు బళ్ళారి రాఘవ జయంతి వేడుకలను ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బళ్ళారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో బళ్ళారి రాఘవ జన్మించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేని కాలంలో నాటక రంగం ద్వారా సామాజిక మార్పులకు దోహదపడిన మహోన్నత వ్యక్తి అన్నారు. న్యాయవాదిగా పనిచేస్తూ కళారంగ అభివృద్ధి కోసం సంపదను, సమయాన్ని వెచ్చించారన్నారు. ఆయన చేసిన సేవలు నేటితరం యువతకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర ఎంతో కీలకం : ఎస్పీ



కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోర్టులోని కేసుల విచారణలో పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ కేపీఎస్ కిషోర్ అన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లతో ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టులో విచారణలో ఉన్న కేసులకు సంబంధించి సాక్ష్యులను సకాలంలో హాజరుపరిచి ముద్దాయిలకు శిక్ష విధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏలూరు జిల్లాలో ఎవరైనా నేరస్తుడు నేరం చేయాలంటే వెన్నులో వణుకుపుట్టేలా, కోర్టులో ముద్దాయిలకు శిక్షపడేలా కోర్టు కానిస్టేబుళ్ల విధులు నిర్వహించాలన్నారు. ఒక కేసులో ముద్దాయి శిక్ష నుంచి తప్పించుకుంటే అది సమాజానికి చెడు చేస్తుందన్నారు. ఉద్యోగ నిర్వహణలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసా పత్రాలతో, నగదు పురస్కారాలతో సత్కరిస్తామన్నారు. అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా, మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, జిల్లా కోర్టు మానిటరింగ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుంతరోడ్ల నిర్మాణానికి కృషి : బ్రహ్మారాజు

ద్వారకాతిరుమల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన పుంతరోడ్ల నిర్మాణానికి ఏఎంసీ నిధులు కేటాయిస్తామని గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు అన్నారు. శనివారం జరిగిన ద్వారకాతిరుమల మండల పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధి,ఇ సంక్షేమానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎంపీడీవో వీవీవీ ప్రకాష్, తహసీల్దారు జెవి సుబ్బారావు అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన

ఏలూరు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిగా పని చేస్తాయని తంగెళ్లమూడి అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జున్ అన్నారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలే బిడ్డలకు అనువైన ఆహారమని, బిడ్డ శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. బిడ్డల్లో నీళ్ల విరోచనాలు, కామెర్లు, పోలియో వంటి వైరల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు: తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రూపాదేవి అన్నారు. పోలసానిపల్లి 14 నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ, రాణికుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: తల్లిపాల ప్రాధాన్యతను అంగన్వాడీ కేంద్రాలతో పాటు ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు వివరించి వాటి విలువను తెలియజేయాలని ఏలూరు ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాతరాణి అన్నారు. శనివారం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సర్పంచ్ రాంధేలక్ష్మీసునీత, వైద్యాధికారి శ్రావణ్ రెడ్డి, అంగన్వాడీ సెక్టన్ సూపర్‌వైజర్ ఎం.భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలతో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

బుట్టాయగూడెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తమను బలవంతంగా బయటకు తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మోదేలు గ్రామానికి చెందిన కొండరెడ్లు కెచ్చెల బాల్‌రెడ్డి, కెచ్చెల రాజురెడ్డి, కెచ్చెల ముక్కారెడ్డి, కెచ్చెల చిన్నంరెడ్డి, కెచ్చెల సురేష్‌రెడ్డి ఫిర్యాదు నకళ్లను విలేకరులకు శనివారం అందజేశారు. బుట్టాయగూడెం-ఏలేరుపాడు మండలాల సరిహద్దు ప్రాంతంలోని మోదేలు గ్రామంలో నివాసం ఉంటున్నామని తెలిపారు.తమకు రోడ్డు, విద్యుత్, ఇళ్ళు, మంచినీళ్ళు లేవని ఫిర్యాదులో తెలిపారు. మోదేలు గ్రామానికి ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో 22 ఇళ్ళు, విద్యుత్ లైన్, రోడ్డు మంజూరైనా అటవీ శాఖ అధికారుల అభ్యంతరాలతో అన్ని పనులు నిలిచిపోయినట్టు కమిషన్‌కు తెలిపారు. అడవి పోడుపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు పోడు భూములు ఇచ్చేది లేదనడంతో తమ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు.. తామంతా మోదేలు గ్రామంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

5న సబ్ స్టేషన్ల ముట్టడిని జయప్రదం చేయండి

టి.నర్సాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల సమస్యపై స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో వామపక్ష పార్టీల కార్యకర్తల రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు బి.ఎస్.సాగర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు.సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు డి.వెంకట్రావు, సీపీఐ(ఎంఎల్) జనశక్తి నాయకులు భాస్కర్, సీపీఐ నాయకులు కె.శ్రీనివాసరావు, పైడాని ఏకాంబరధరరావు, రైతు సంఘం నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, మడకం కుమారి, సీపీఎం మండల కార్యదర్శి సుధారాణి పాల్గొని ప్రసంగించారు. సమస్యలపై మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టామని, ఈ నెల 5న ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

● కుక్కునూరు: స్మార్ట్‌మీటర్లు రద్దు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 5న నిర్వహించే విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడిని విజయవంతం చేయాలని వామపక్ష పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కుక్కునూరులో జరిగిన సీపీఐ, సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విధానంతో ప్రభుత్వం ప్రజలను నిలువుదోపిడీ చేస్తోందని ఆరోపించారు. సీపీఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, బాబూరావు, వైసాయి కిరణ్, లక్ష్మయ్య, ఎస్‌కే వలి, రమేశ్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ శనివారం ప్రజా సంఘాలు మండల కేంద్రంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాయి. నాయకులు కారం రాఘవ, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లు వద్దని వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక వాటినే అమలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. నాయకులు పి.నాగేశ్వరావు, టి.మునేశ్వరావు, బి.వినోద్, కె.పోతురెడ్డి, జి.పండు, కె.నడిపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోకు సన్మానం

పెదపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):ఇంచార్జి ఎంపీడీవో, మండల విస్తరణాధికారి సాధనాల సూర్యకుమార్‌ను పెదపాడు ఎంపీడీవో అమీలుజమ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 35 ఏళ్లు ఉద్యోగిగా సేవలందించి పదవీ విరమణ చేసిన సూర్యకుమార్ సన్మాన సభ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. సన్మాన గ్రహీత సూర్యకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి నిరంతరం విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో తగిన సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏవో ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.సూర్యకుమార్‌ను సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు, అధికారులు

శ్రీవారికి శ్రావణ పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలోని రెండవ శనివారం కావడంతో రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు స్వామికి తులసీ దళాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. భగవద్గీత పారాయణ మండలి సభ్యులు సామూహికంగా భగవద్గీతను పఠించారు.

ఉత్సాహంగా మెగా డ్యాన్స్ పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలోని ఎస్.ఫంక్షన్ హాల్లో చిరంజీవి యువత, ఏలూరు మెగా ఫ్యామిలీ నిర్వహణలో ఏలూరు మెగా ఫ్యాన్స్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో డ్యాన్స్ పోటీలో పాల్గొన్నారు. చిరంజీవి నటించిన చిత్రాల్లో పాటలకు డ్యాన్స్ వేసి ఉర్రూతలుగించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

వ్యాస రచనలో మతీన్ ప్రతిభ

ఏలూరు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ఇటీవల తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీలో ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం ద్వితీయ సంవత్సం విద్యార్థి ఎస్.కె. అబ్దుల్ మతీన్ ప్రథమ బహుమతిని గెలుచుకుని జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు.

గిరిజనులకు పట్టాలివ్వండి

టి.నర్సాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎస్ఆర్ నగర్‌లో ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న గిరిజన పేదలకు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ నగర్ గిరిజన పేదలు శనివారం తహసీల్దార్ సాయిబాబాకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల నాయకులు అలుమోలు మురళీ మడకం సుధారాణి, కుమారిలు, మాట్లాడుతూ ఏఎస్ఆర్ నగర్‌లో ప్రభుత్వ భూమిలో గత కొన్నేళ్లుగా సుమారు 50 మంది పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూములపై హైకోర్టు డైరెక్షన్ ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ పేదల వివరాలివ్వాలని సూచించారు. వినతిపత్రం అందించిన వారిలో శిరీష, వరగడ కుమారి ఉన్నారు.

పట్టిసీమలో భక్తుల పూజలు

పోలవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత శ్రీసుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టిసీమ భక్తులు బొడ్డు నాగేశ్వరరావు, కొల్లు చెంచయ్య, కోడి సాయి దంపతులు ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర చక్కెర పొంగలి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తొమ్మిది శనివారాల మహిళా భక్తులు కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వీధిలైట్ల ఏర్పాటుతో హర్షం

పెదపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):వట్లూరు మినీ బైపాస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకూ వీధిలైట్ల ఏర్పాటుతో స్థానికులతో పాటుగా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బయటి నుంచి నగరంలోకి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి కావడం, రాత్రిపూట వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బందులు గుర్తించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమస్య పరిష్కారానికి జేసీ ధాత్రిరెడ్డితో మాట్లాడి వీధిలైట్లు ఏర్పాటు చేయించారు.

4న రుద్రభూమి ప్రారంభం

ఉంగుటూరు ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కైకరం తూర్పువీధిలో కాల్వగట్టుకు చేర్చి ఎంపీ నిధులు రూ.8 లక్షలు, దాతలు అందించిన రూ.11 లక్షలతో స్మశాన వాటికను అభివృద్ధి చేశారు. కాటి కాపరి, శివుని విగ్రహం, బీడు పొయ్యి, స్నాన ఘట్టంతో పాటు నుయ్యిని ఏర్పాటు చేశారు. సోమవారం స్వామిని పూర్ణజానంద సరస్వతి మాతాజీ(చిన్మయ మిషన్ విద్యా వైద్య సేవా కేంద్రం ఏలూరు)వారిచే ప్రారంభించనున్నట్టు రుద్ర భూమి అభివృద్ధి కమిటీ తెలిపింది.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ఆరా

ఏలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం ఆరా తీశారు. కొంత మంది పీజీఆర్ఎస్ అర్జీదారులకు ఫోన్‌చేసి, ముఖ్యంగా నాణ్యత, సంతృప్తికరమైన పరిష్కారం లభించిందా అని కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

వెండి, నగదు అపహరణ

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిమ్మలగూడెంలో వి.సత్యవతి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో 15 తులాల వెండి, నగదు అపహరించుకుపోయారు. బాధితురాలు సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు లక్కవరం ఎస్.ఐ. శశాంక తెలియజేశారు. గత పదిహేను రోజుల క్రితం అనారోగ్యం కారణంగా సత్యవతి మండలంలోని గురవాయిగూడెంలో నివాసముంటున్న తన కుమారుడి ఇంటికి వెళ్లింది. శనివారం ఇంటి తలుపులు తెరచి ఉన్నట్టు స్థానికులు సత్యవతికి ఫోన్ ద్వారా తెలియజేశారు. వెంటనే ఇంటికి వెళ్లి చూసే సరికి 15 తులాల వెండి, నగదు చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేసినట్టు ఎస్.ఐ. తెలిపారు.



జాతీయ జెండాలతో స్వచ్ఛంద సేవకులు

పింగళి వెంకయ్య జయంతి

పెదపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య తెలుగు జాతికి గర్వకారణమని స్వచ్ఛంద సేవా సంస్థ మానవత సభ్యులు పేర్కొన్నారు. అప్పనవీడులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా, త్రివర్ణ పతాక రూపకర్తగా పింగళి వెంకయ్య సేవలను పలువురు కొనియాడారు.

● ఏలూరు రూరల్: జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని శనివారం సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సంస్థ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్, ఘంటశాల స్వరపీఠం, బహుజన ఆఫీసర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పింగళి వెంకయ్య చేసిన పోరాటాలు, త్యాగాలు మరువలేనివన్నారు.


సింగరాయ పాలెంలో నమూనా చెక్కును విడుదల చేస్తున్న కూటమి నాయకులు


చెక్కును పంపిణీ చేస్తున్న ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

» ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

» మీర్జాపురంలో అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ

నూజివీడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు టీడీపీ అండగా నిలిచిందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. శనివారం నూజివీడు మండలం మీర్జాపురంలోని పీఏసీఎస్ ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.5000, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 2000 కలిపి మొత్తం రూ. 7000 రైతుల ఖాతాలలో జమ చేశారని, ఏడాదికి రూ. 20,000 మూడు విడతలలో రైతు ఖాతాకు జమ అవుతుందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు ఇప్పటికే రూ. 2342.92 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. దేశ ప్రగతిలో అన్నదాతది ప్రధానపాత్ర అని నమ్మే పార్టీ టీడీపీ అన్నారు. రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం, యంత్ర పరికరాలు, రైతు రథాలు సబ్సిడీతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇవ్వగా, వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసిన విషయాన్ని రైతులు, ప్రజలు గుర్తించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ. 12,500 ఇస్తామని చెప్పి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చిందన్నారు. అంతేకాదు ధాన్యం డబ్బులు కోసం రైతులు ఉద్యమాలు చేయవలిసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతులకు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం రైతులకు బకాయి పెట్టిన రూ. 1674 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాల ఉద్యాన సాగు లక్ష్యంగా పెట్టుకుని ప్రతి ఎకరానికి సూక్ష్మ సేద్యం అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పత్తి కొనుగోళ్లలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 37 కేంద్రాలలో 44 వేల మంది రైతుల నుంచి 20 లక్షల టన్నుల పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. అలాగే మిర్చి ధర పతనమైనప్పుడు క్వింటాల్‌కు రూ. 1178 ఇచ్చి ఆ రైతులను ఆదుకున్నామన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, వ్యవసాయ ఏడీ అధికారి జి. విద్యాసాగర్, తహసీల్దార్ భద్రనాయక్, ఎంపీపీ శిరీష, సర్పంచ్ చిన్ని, నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


చనుబండలో ప్రధాని, సీఎం ప్రసంగాల వీక్షణం


కోరుకొల్లులో రైతులకు చెక్కు పంపిణీ


ముసునూరులో ప్రధాని ప్రసంగ వీక్షణం


గోపవరంలో రైతులకు చెక్కు పంపిణీ

అన్నదాత సుఖీభవ

» ఖాతాల్లో నగదు జమతో అన్నదాతల ఆనందం

» సూపర్ సిక్స్‌లో పథకాల అమలుపై హర్షం

చాట్రాయి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద కూటమి ప్రభుత్వం రూ. 7 వేలు రైతుల ఖాతాలలోకి జమ చేస్తుండటంతో అన్నదాతల కుటుంబాలలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నిధుల విడుదల సందర్భంగా మండలంలోని చనుబండ, పోలవరం, జనార్దనవరం రైతు సేవా కేంద్రాల్లో శనివారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రసంగాలను రైతులు, కూటమి నాయకులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల టీడీపీ నాయకులు మరిడి చిట్టిబాబు, మాదాసు చిన్న పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలో 8062 మంది రైతులకు రూ. 5.64 కోట్లు విడుదలైనట్టు ఏవో శివశంకర్ తెలిపారు.

కలిదిండి: రైతుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి అన్నారు. శనివారం కోరుకొల్లులో అన్నదాత సుఖీభవ నిధుల విడుదలలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ కలిదిండి మండలంలో మొత్తం 771 మంది రైతులకు రూ.53 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క రైతు బ్యాంక్ ఖాతాలో రూ.7 వేలు జమ అవుతాయన్నారు. డీసీ ఛైర్మన్లు పేటేటి సత్యనారాయణ, ఎం. భోగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు కేశిరెడ్డి బలరామ్, మాజీ ఎంపీపీ వలవల రామారావు, అగ్నికుల క్షత్రియ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్లు అంగ్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, కోరుకొల్లు సర్పంచ్ కనకదుర్గ, ఎంపీటీసీ రమాదేవి పాల్గొన్నారు.

ముసునూరు: కూటమి ప్రభుత్వ పాలనలోనే రైతుల సంక్షేమం సాధ్యమని నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గార్లపాటి నరసింహారావు అన్నారు. శనివారం అన్నదాత సుఖీభవ నిధుల విడుదల సందర్భంగా ప్రధాని ప్రసంగాన్ని ముసునూరు రైతుసేవా కేంద్రంలో టీడీపీ నాయకులు, రైతులు వీక్షించారు.


అల్లూరులో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని 8205 రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.4.10 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ. 1.29 కోట్లు కలిపి మొత్తం రూ. 5.56 కోట్లును తొలివిడతగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఈ పథకం ప్రారంభించడాన్ని రైతులు వీక్షించారు. ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, తులిమెల్లి రంగరావు, రైతులు పాల్గొన్నారు.

కైకలూరు: రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అందిస్తోందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం గోపవరంలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన రూ.13500 కంటే మరో రూ.6500 అదనంగా కలిపి రూ.20 వేలు అందించడం జరుగుతుందన్నారు. మండలంలో 1234 మంది రైతులకు గాను రూ. 85 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసయ్య, ఎంపీపీ అడవి కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు త్రినాథరాజు, నియోజకవర్గ కో కన్వీనర్ విజయలక్ష్మీ, వ్యవసాయ శాఖ ఏడీ పార్వతీ, ఏవో దివ్య, గోపవరం పీఏసీఎస్ అధ్యక్షుడు రాజేష్‌బాబు, తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, సర్పంచ్ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ముదినేపల్లి కూటమి నాయకులు అన్నారు. సింగరాయపాలెంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం వ్యవసాయశాఖ నిర్వహించిన కార్యక్రమంలో ముదినేపల్లి మండలంలోని 4909 మంది రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3.30 కోట్ల అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నమూనా చెక్కును విడుదల చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలులో భాగంగా రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో టీడీపీ నాయకులు, రైతులు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నీలిపల్లి సన్యాసిరావు, ముంగ్రు బాల రాజు, దాసరి శ్రీను, గంగుల శ్రీరాములు, పెరుమాళ్ల జయలక్ష్మీ ఆధ్వర్యంలో రైతులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అన్నదాత సుఖీభవ నిధులు సకాలంలో విడుదల చేసి రైతులను చంద్రబాబు ఆదుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

మండవల్లి: అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద మండవల్లి మండలంలోని అయ్యవారి రుద్రవరం, కానుకొల్లు, పెరికేగూడెం గ్రామాల్లోని రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను అందజేశారు. పెరికేగూడెంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మండలానికి అన్నదాత సుఖీభవ కింద 1997 మంది రైతులకు రూ.1.32కోట్లు మంజూరైనట్లు మండవల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ వెల్లడించారు. కూటమి నాయకులు ముళ్లపూడి సత్యనారాయణ, నారగాని కొండలు, ఎలికే రాంబాబు, కూనపురెడ్డి ప్రసాద్, బోయిడి సురేష్, బాదిన వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు విచ్ఛిన్నం


మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మయ్య

నూజివీడు టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటి నూజివీడు శాక్ ఆడిటోరియం ట్రిపుల్ ఐటీ పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై గుంటూరు సీఐడీ డీఎస్పీ జి. లక్ష్మయ్య అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చడానికి ప్రయత్నించాలని సూచించారు. క్షణికావేశాలకు పోయి ర్యాగింగ్‌కు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, వ్యక్తిగత క్రమశిక్షణ, వ్యక్తిగత నియంత్రణ ఉంటేనే అనుకున్నది సాధించగలమన్నారు. తప్పు చేయకూడదన్న ఆలోచన వస్తే ర్యాగింగ్‌కు దూరంగా ఉంటారని వివరించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్, ఎ. లక్ష్మణ్, డీన్ చిరంజీవి, చీఫ్ వార్డెన్‌లు సురేష్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువు సర్వే పనుల అడ్డగింపు

ముదినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చినకామనపూడి పంచాయతీ చెరువు సర్వే పనులను ఆ గ్రామానికి చెందిన కొందరు శనివారం అడ్డుకున్నారు. మండల ఇన్‌ఛార్జి సర్వేయర్ రాజు శేఖర్‌రెడ్డి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బందితో పంచాయతీ చెరువు సరిహద్దులు గుర్తించేందుకు వెళ్ళగా ఆ చెరువు లీజుదారు సుబ్రహ్మణ్యం, మరో వ్యక్తి రంగారావుతో పాటు మరికొందరు సర్వే పనులకు అభ్యంతరం తెలిపారు. సుమారు 2.35 ఎకరాల విస్తర్ణం కలిగిన ఆ పంచాయతీ చెరువును సర్వే చేసి హద్దులను నిర్ణయించాలని సర్పంచ్ చిట్టూరు నాంచారయ్య ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు మెమొరాండం ఇచ్చిన నేపథ్యంలో శనివారం సర్వేయర్, ఆర్ఐ వెళ్ళగా తాము కూడా గ్రామంలోని పలు స్థలాల సర్వేకు అర్జీలు పెట్టామని వాటిని కూడా సర్వే చేయాలని డిమాండ్ చేస్తూ సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు పంచాయతీ చెరువు సర్వే పనులను ఆపాలని చెప్పడంతో అధికార్లు వెనక్కు వెళ్ళిపోయారు.


చెక్కపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

ముసునూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీయస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం చెక్కపల్లిలో తల్లిపాల వారోత్సవాలల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, తల్లిపాలు క్రమం తప్పకుండా రెండు సంవత్సరాలు ఇవ్వాలన్నారు. తల్లిపాల వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతోపాటు వారి పెరుగుదలకు దోహదపడి, ఆరోగ్యవంతులుగా ఉంటారని వివరించారు. హెచ్‌వీ సీతమ్మ మాట్లాడుతూ నార్మల్ డెలివరీకి సిద్ధపడాలని, అందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. బిడ్డకు తప్పకుండా అన్ని డోసులు ఇమ్యూనైజేషన్ చేయించుకోవాలని కోరారు.

ఆగిరిపల్లి: తల్లిపాలు అన్నింటికన్నా శ్రేయస్కరమని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు అన్నారు. శనివారం ఆగిరిపల్లి పీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలలు వరకు తల్లిపాలు తప్ప ఏ ఇతర ద్రవ పదార్థాలు బిడ్డకు తాగించకూడదన్నారు. తల్లిపాలు పిల్లలకు పట్టడం వల్ల తల్లులకి కూడా ఆరోగ్యమేనని తెలిపారు. తల్లిపాల వల్ల ఇన్ఫెక్షన్ల సమస్యలు రావని అన్నారు. ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిట్నేని కుటుంబానికి మంత్రి పరామర్శ

ఆగిరిపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిట్నేని శివరామకృష్ణ తండ్రి చిట్నేని హనుమంతరావు ఇటీవల మరణించడంతో మంత్రి పార్థసారథి వారి కుటుంబీకులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని, పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

సొసైటీ ఇన్‌చార్జిల పాలనా గడువు పెంపు

ఏలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో పాలకవర్గాలు లేని సహకార సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ సహకార శాఖ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పెంచిన గడువు జూలై 31తో ముగియడంతో ఏలూరు జిల్లాలో 92 సొసైటీలకు, పశ్చిమలో 60 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జుల పదవీకాలాన్ని వచ్చే ఏడాది జనవరి 30 వరకు పొడిగించారు. పర్సన్ ఇన్‌చార్జిలుగా ఉంటూ పదవీ విరమణ, బదిలీ అయిన వారి స్థానాల్లో వేరొకరికి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరు జిల్లాలో ముసునూరుకు సభ్యుడిగా సీహెచ్ రామారావు (బ్రాంచ్ సూపర్‌వైజర్), బయ్యనగూడెం, సరిపల్లికి కొయ్యలగూడెం బ్రాంచ్ మేనేజర్ జి.కనక మహాలక్ష్మిని, దొరమామిడికి కె.విజయరాజును, తిరుమలాపురానికి కేఎస్. మూర్తిని, అచ్చయ్యపాలెంకు జె.విజయరాజును నియమించారు.


అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి

వైభవంగా కొలుపుల మహోత్సవం

ఆగిరిపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులందరికీ అమ్మవార్ల ఆశీస్సులుండాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కొత్త ఈదరలో శ్రీమహాలక్ష్మి, అంకమ్మ, మద్దిరావమ్మ, చంద్రమ్మ కొలుపుల మహోత్సవాల సందర్భంగా శనివారం మంత్రి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, టీడీపీ నాయకుడు సతీష్, సర్పంచ్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ముదినేపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురజ గ్రామంలో గంగానమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 4న నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారు, పోతురాజు, నాగ బంధం విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గోపూజ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, అఖండ స్థాపన, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి ట్రస్టు అధ్యక్షుడు యెర్నేని వెంకట సుబ్బారావు, కార్యదర్శి వీరిశెట్టి నాగమల్లేశ్వరరావు, కోశాధికారి జాస్తి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆముదాలపల్లికి చెందిన యాజ్ఞికుడు సోమరాజుపల్లి ఈశ్వర నాగ కుమార శర్మ హోమాలు నిర్వహించారు.

మాటూరి ప్రసాద్‌కు మాతృ వియోగం

నూజివీడు టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య ప్రముఖుడు, బీజేపీ నాయకులు మాటూరి ప్రసాద్ తల్లి సావిత్రమ్మ (99) శనివారం ఉదయం మృతి చెందారు. ఆమెకు బీజేపీ నాయకులు, పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం వాణిజ్య సంఘాల నాయకులు నివాళులర్పించారు. బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు నాగరాణి, జిల్లా ఉపాధ్యక్షులు బోను అప్పారావు, వసుంధరా దేవి, జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి దోసపాటి మల్లికార్జునరావు, జగదీష్, రవికిషోర్, తదితరులు మాటూరి ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు.

తేనె మంగు నివారణ చర్యలు చేపట్టాలి

మామిడి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం


తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

నూజివీడు టౌన్, ఆగస్టు 2, (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలు కొత్త చిగురు వచ్చే దశలో తేనె మంగు ఉధృతి అధికంగా కనిపిస్తోందని నూజివీడు మామిడి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. బి. కనక మహాలక్ష్మీ అన్నారు. శనివారం నూజివీడు మామిడి పరిశోధన స్థానం పరిధిలోని మామిడి తోటలను ఆమె శాస్త్రవేత్త జి. శాలిరాజ్‌తో కలిసి క్షేత్ర సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేనెమంగు పురుగు ఉధృతి అధికంగా ఉండటం గమనించామన్నారు. వీటితో పాటు ఈ తోటలలో జింకు మరియు బోరాన్ ధాతు లోపం అధికంగా ఉందన్నారు. ఈ కొత్త చిగురు వచ్చే దశలో రైతులందరూ తేనె మంగు పురుగు నివారణకు తోటల్లో గుబురుగా పెరిగిన కొమ్మలను కత్తిరించడం ద్వారా గాలి వెలుతురు ప్రసరించేలా చేయాలన్నారు. తోటలో నీళ్ళు నిలవకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. వేప గింజల కషాయం 5% లేదా అజాదిరిక్టాన్ 3000 పిపిఎం-2 ఎంఎల్ లేదా క్లోరో ఫైర్పాస్ 2.5 ఎంఎల్, మోనోక్రోటోపాస్ 1.6 ఎంఎల్ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి ఆకులు, చెట్టు మొదలు, చెట్టు కాండం, కొమ్మలు తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు. వీటితో పాటుగా జింకు దాతులోప నివారణకు జింక్ సల్ఫేట్ 5 గ్రాములు, బోరాన్ ధాతు లోప నివారణకు బోరం 2 గ్రాములు, కొత్త చిగుళ్ళను ఆశించే తెగుళ్ళ నివారణకు మాంకోజెబ్, కార్బెండజిమ్ (సాఫ్) శిలీంద్ర నాశిని 2 గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

వీక్లీ స్పెషల్ రైళ్ల పొడిగింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వీక్లీ స్పెషల్ ట్రైన్స్‌ను పొడిగిస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైల్ నెంబర్ 08547 విశాఖ పట్టణం నుంచి తిరుపతి ప్రతి బుధవారం వెళ్లే రైలు ఆగస్టు ఆరవ తేదీ నుంచి సెప్టెంబర్ 24వ తేదీ వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 08548 తిరుపతి నుంచి విశాఖపట్టణం ప్రతి గురు వారం వెళ్లే ఈ రైలు ఆగస్టు 7వ తేదీ నుంచి సెప్టెంబర్ 25 వరకూ, రైల్ నెంబర్ 08579 విశాఖ పట్టణం నుంచి చెర్లపల్లి ప్రతి శుక్రవారం వెళ్లే రైలును ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 26 వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 08580 చర్లపల్లి నుంచి విశాఖపట్టణం ప్రతి శనివారం వెళ్లే ఈ రైలును ఆగస్టు 9వ తేదీ నుంచి సెప్టెంబర్ 27 వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 02863 సత్రగంజి నుంచి యశ్వంత్‌పూర్ ప్రతి గురువారం వెళ్లే రైలును ఆగస్టు 7వ తేదీ నుంచి ఆగస్టు 28వ వరకూ పొడిగించారు. 08864 యశ్వంత్‌పూర్ నుంచి సత్రగంజి ప్రతి శనివారం వెళ్లే ఈ రైలును ఆగస్టు 9వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 01435 షోలాపూర్ నుంచి ఎల్‌టీటీ ముంబై ప్రతి మంగళవారం వెళ్లే ఈరైలును ఆగస్టు 5వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 01436 ఎల్‌టిటి ముంబై నుంచి షోలాపూర్ ప్రతి బుధవారం వెళ్లే ఈ రైలు ఆగస్టు 6వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ పొడిగించారు. రైల్ నెంబర్ 06519 ఎస్‌ఎంవిటి బెంగుళూరు నుంచి బీదర్ ప్రతి గురువారం వెళ్లే రైలును అగస్టు 14 వరకూ పొడిగించారు. 06520 బీదర్ నుంచి ఎస్ఎన్‌విటి బెంగుళూరు ప్రతి శుక్ర వారం వెళ్లే ఈరైలు ఆగస్టు 15 వరకూ పొడిగిస్తూ శనివారం రాత్రి దక్షిణమధ్య రైల్వే అధికా రులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.



పోటీ పుస్తకాల వితరణ

కైకలూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీలత అన్నారు. శనివారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవనిగడ్డకు చెందిన అంజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అందించిన ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పోటీ పరీక్షలకు చెందిన అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫౌండేషన్ ఛైర్మన్ బి. నవీన్, సీఈవో ప్రొఫెసర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు పి. రవికుమార్, జాలబాబు, పాల్ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

అభద్రతలో.. అమ్మతనం!

(5వ పేజీ తరువాయి)

క్లినిక్‌లో గర్భధారణకు ప్రాథమిక వైద్యపరీక్షలను మాత్రమే చేయాలి. లెవెల్-2 క్లినిక్‌లలో అడ్వాన్స్‌డ్ వైద్యపరీక్షలు, పునరుత్పత్తి ప్రక్రియలను చేయవచ్చు. ఏఆర్టీ బ్యాంక్‌లలో దాతనుంచి వీర్యాన్ని(స్పెర్మ్) సేకరించి భద్రపర్చవచ్చు. వీటిని ఏర్పాటు చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని నిర్ణీత రుసుం చెల్లించాలి. కలెక్టర్ అధ్యక్షతన గల జిల్లా బోర్డులో డీఎంహెచ్‌వో వైస్ ఛైర్మన్‌గా, ఒక మహిళా సంఘం ప్రతినిధి, న్యాయనిపుణుడు, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ సభ్యులుగా వున్న కమిటీ పరిశీలించి, ఐసీఎంఆర్ చెక్‌లిస్టు ప్రకారం అన్ని నిబంధనలను పాటించిన వాటికి ఐదేళ్ల కాలపరిమితితో కూడిన అనుమతినిస్తుంది. ఇన్‌ఫెర్టిలిటీ/ఏఆర్టీ/సరోగసీ విధానంలో గర్భధారణ కోసం క్లినిక్‌లకు విచ్చేసే దంపతుల వివరాలు, వారికందించే వైద్యం, మందులు, సరోగసీ తల్లి వివరాలు, తదితర సమగ్ర సమాచారాన్నంతటినీ ఎప్పటికప్పుడు నిర్వాహకులు నేషనల్ రిజిస్ట్రీలో నమోదు చేయడంతో పాటు, డీఎంహెచ్‌వో కార్యాలయానికి తెలపాలి. ఏఆర్టీ లెవెల్-1 క్లినిక్‌లో గైనకాలజిస్టు, ఆంగ్రాలజిస్టు, మోటివేటర్ తప్పనిసరిగా ఉండాలి. లెవెల్-2 క్లినిక్‌లో డైరక్టర్, అనస్థిటిస్టు, గైనకాలజిస్టు, ఆంగ్రాలజిస్టు ఉండాలి. ఏఆర్టీ/సరోగసీ విధానంలో పేషెంట్ల నుంచి ఆయా సేవలకు వసూలు చేయడానికి అధికారికంగా ఫీజులను ప్రభుత్వం నిర్ణయించలేదు. ఫలితంగా దంపతుల అవసరతను బట్టి సగటున ఒక్కో సరోగసీ కేసుకు రూ.ఎనిమిది నుంచి రూ.10 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలోనే వసూలు చేస్తున్నారు.

పేదల పెన్నిధి చంద్రబాబు

స్పౌజ్ పెన్షన్ల పంపిణీలో 'పోసిన'

ముదినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పాలిట పెన్నిధి అని టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు అన్నారు. ఊటుకూరులో శనివారం కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేశారు. గతంలో భర్త చనిపోయి పెన్షన్ కోల్పోయిన వితంతువులకు కూడా పెన్షన్ల మంజూరుకు కృషి చేస్తామన్నారు. జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సూదాబత్తుల వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పేదలకు అసరాగా నిలుస్తుందని సర్పంచ్ ముళ్ళపూడి సుధారాణి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సీహెచ్. మల్లిబాబు అన్నారు. సూరేపల్లిలో నూతనంగా 8 మందికి మంజూరైన వితంతు పెన్షన్‌ల ను శనివారం వారు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి హామీ ప్రకారం నెలలో మొదటి రోజు పెన్షన్ ఇవ్వడంతో పెన్షన్‌దారుల్లో ఆనందం వ్యక్తమౌతోంద న్నారు. వార్డు సభ్యుడు కొక్కిరపాటి శోభనాద్రి, కార్యదర్శి నాగశిరోమణి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 7 లక్షలకు టోకరా

ముదినేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తనకు నాయకులు బాగా తెలుసునని వాళ్ళ కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ఉద్యోగం గ్యారెంటీగా ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి గ్రామానికి చెందిన బూషే చిరంజీవి స్థానికంగా ప్రైవేటుగా డ్రైవర్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతను డిగ్రీ పాస్ అయిన తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అదే గ్రామానికి చెందిన పి. విక్రమ్ అనే వ్యక్తి ఏడాది క్రితం తాను వైసీపీ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, నారాయణరాజు కార్లకు డ్రైవర్‌గా పనిచేస్తున్నానని కొంత సొమ్ము కడితే తాను ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో చిరంజీవి విడతల వారీగా విక్రమ్‌కు రూ. 7 లక్షల సొమ్మును ముట్టజెప్పాడు. అయితే ఉద్యోగం ఇప్పించలేదు. చాలా కాలం నుంచి అడుగుతున్నా ఉద్యోగం వేయించకపోగా ఇచ్చిన సొమ్ము కూడా తిరిగి ఇవ్వకపోవడంతో తాను మోసపోయానని గుర్తించిన చిరంజీవి శనివారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థి అదృశ్యం


ఉపేంద్ర (ఫైల్)

ముసునూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థి అదృశ్యంపై ముసునూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం. చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రమణక్క పేటకు చెందిన పటాపంచుల వెంకటరామయ్య పెద్ద కుమారుడు ఉపేంద్ర స్థానిక జడ్పీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 1వ తేదీన ఉపేంద్ర పుట్టినరోజు కావడంతో పార్టీ చేసుకుంటానని తల్లిదండ్రులను డబ్బులు అడిగాడు. అయితే వారు మందలించడంతో పుస్తకాల బ్యాగ్ తీసుకుని పాఠశాలకు వెళ్ళిన ఉపేంద్ర రాత్రి వరకు ఇంటికి తిరిగిరాలేదు. కుమారుడు ఆచూకీ కోసం తల్లిదండ్రులు, బంధువులు వెతికిన కనిపించకపోవడంతో తండ్రి వెంకటరామయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తన కుమారుడు ఆచూకీ తెలిస్తే 95731 22844 నంబరుకు సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరారు.